http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

బుధవారం 1 ఏప్రిల్ 2026

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## ఇందిరమ్మ లబ్ధిదారులకు గుడ్‌న్యూస్

- ఆ తుది దశ పనులు చేయకున్నా ఆఖరి బిల్లుల మంజూరు
- ఇందిరమ్మ లబ్ధిదారులకు శుభవార్త
- ఇంటి తుది దశ పనులు చేయలేకపోతున్న వారికి వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ
- ఇబ్బందులు గమనించి, సడలింపు చేసిన సర్కారు

హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. ఇందిరమ్మ నిర్మాణంలో భాగంగా కప్పు దశ దాటినా, ప్లాస్టరింగ్ విద్యుత్తు వైరింగ్ తదితర తుది దశ పనులు చేయలేకపోతున్న లబ్ధిదారులకు ఓ వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణంలో కప్పు వరకు పూర్తయినా, బయట లోపల గోడలకు ప్లాస్టరింగ్, విద్యుత్తు అవసరాలకు వైరింగ్, గచ్చు, గోడలకు సున్నం, కలర్స్ ఇలా తదితర పనులన్నీ పూర్తి చేసినట్లు ధ్రువీకరించిన తర్వాత - మిగతా3లో

# కమలంలో కాసుల లొల్లి

- అధిష్ఠానం పంపిన నిధులు దుర్వినియోగమైనట్లు బీజేపీ నాయకత్వం ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది
- పార్టీ పంపిన ఫండ్స్ పూర్తిస్థాయిలో అభ్యర్థులకు చేరలేదు
- ఆయా జిల్లాల బాధ్యులు సగానికి పైగా 'స్వాహా' చేశారని గుర్తించినట్లు సమాచారం
- పలు రకాల సమీక్షల అనంతరం అగ్రనేతలు ఈ అంచనాకు వచ్చినట్లు చర్చ జరుగుతున్నది



హైదరాబాద్

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల కోసం అధిష్టానం పంపిన నిధులు దుర్వినియోగమైనట్లు బీజేపీ నాయకత్వం ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. పార్టీ పంపిన ఫండ్స్ పూర్తిస్థాయిలో అభ్యర్థులకు చేరలేదని, మధ్యలో ఆయా జిల్లాల బాధ్యులు సగానికి పైగా 'స్వాహా' చేశారని గుర్తించినట్లు సమాచారం. పలు రకాల సమీక్షల అనంతరం అగ్రనేతలు ఈ అంచనాకు వచ్చినట్లు చర్చ జరుగుతున్నది. ముందుగా చెప్పిన ఓట్లు, సీట్లకు, ఫలితాలకు ఏ మాత్రం పొంతన కుదరకపోవడంతో.. అభ్యర్థుల ఓటమికి వీరే కారణమని భావిస్తున్నట్లు టాక్. ఈ నేపథ్యంలో ఫండ్స్ స్వాహా చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పార్టీ పదవుల నుంచి తొలగించాలని నిర్ణయానికి వచ్చినట్లు చర్చ జరుగుతున్నది.లోక్ సభ ఎన్నికల్లో 36 శాతం ఓట్లతో బీజేపీ ఎనిమిది స్థానాలను గెలుపొందింది. - మిగతా3లో



## అన్ని మతాలు సహనాన్ని, శాంతిని బోధిస్తాయి

- పశ్చిమాసియాలో యుద్ధం వేళ దలైలామా కీలక వ్యాఖ్యలు
- ప్రముఖ బౌద్ధమత గురువు దలైలామా కీలక వ్యాఖ్యలు
- పశ్చిమాసియా యుద్ధంపై స్పందించిన నోబెల్ గ్రహీత
- యుద్ధం జరుగుతున్న ప్రాంతంలో శాంతి కోసం పోప్ లియో 14 చేసిన విజ్ఞప్తిని సమర్థించిన దలైలామా



## బంగాల్‌లో ఓటర్ల హక్కులకు ముప్పు

- ఈసీ చర్యలపై మమత ఫైర్
- ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో నిజమైన ఓటర్లను తొలగిస్తున్నారన్న ఆరోపణ
- ఈసీకి లేఖ రాసిన మమతా బెనర్జీ
- ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ ఓటర్లను చేర్చే ప్రయత్నం చేస్తున్న బీజేపీపై విమర్శలు

## ప్రపంచ మార్కెట్‌లో విశ్వసనీయ సెమీకండక్టర్ సప్లయర్‌గా భారత్

- గుజరాత్‌లోని సనంద్‌లో కైనెస్ సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రధాని మోదీ
- ఇది కేవలం పారిశ్రామిక విధానం మాత్రమే కాదు, భారతదేశ ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని వెల్లడి



## ఎల్‌డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారు

- కేరళలోని కన్నూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ గాంధీ
- భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందంతో దేశ భవిష్యత్‌ను ప్రధాని నరేంద్ర మోదీ తాకట్టు పెట్టారని ఆరోపణ
- సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలు బీజేపీతో జత కట్టారు
- శబరిమల గోల్డ్ స్కాంపై మోదీ మాట్లాడరేం?





## బంగాల్‌లో రాజకీయ వారసులదే హవా

- టికెట్ల కేటాయింపులో వారికే పెద్దపీట
- అన్ని పార్టీలదీ అదే బాట
- టికెట్ల కేటాయింపులో రాజకీయ వారసులకే పెద్దపీట
- వామపక్షాలు, బీజేపీ సహా అన్ని పార్టీలదీ అదే బాట
- బంగాల్‌లోనూ మారిపోయిన రాజకీయ ముఖచిత్రం
- ఒకప్పుడు విద్యార్థి, కార్మిక, ప్రజా ఉద్యమాల నుంచి నేతల ఎదుగుదల

# వేసవిలో వర్షాలు

- రాష్ట్రవ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలు
- చేతికందిన పంట నేలపాలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిముద్దయిన ధాన్యం
- ఈదురుగాలులకు నేలకొరిగిన వరి, మొక్కజొన్న
- అకాల వర్షానికి చేతికందొచ్చిన మామిడి పంట నేలపాలు
- ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతుల వేడుకోలు

హైదరాబాద్

వేసవికాలంలో వర్షాలు దంచికొడుతున్నాయ్. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు రైతులు నష్టపోయారు. రాష్ట్రవ్యాప్తంగా రాత్రి కురిసిన అకాల వర్షం రైతులను నిండాముంచింది. కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురుగాలులకు వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. చేతికందొచ్చిన మామిడి పంట సైతం నేల పాలయింది. ఆరుగాలం ఎండనకా వాననకా పడిన కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరయ్యిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. - మిగతా3లో



# కోడి కూర తినేదెలా?



- నేటి నుంచి చికెన్ షాపులు బంద్.. మార్జిన్ పెంచాలని డిమాండ్
- పౌల్ట్రీ కంపెనీలు ఇస్తున్న కమీషన్ పెంచాలని చికెన్ దుకాణదారుల డిమాండ్
- నేడు ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాకు పిలుపు
- నేటి నుంచి తెలంగాణ వ్యాప్తంగా చికెన్ షాప్‌ల బంద్ చేపట్టాలని నిర్ణయం
- తమకు న్యాయం చేయాలంటూ నేటి మహాధర్నాకు పిలుపు
- తెలంగాణ వ్యాప్తంగా సుమారు 50 వేల రిటైల్ చికెన్ షాపులు

హైదరాబాద్

రిటైల్ చికెన్ షాపులకు ఇచ్చే మార్జిన్ పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యాప్తంగా నిరసనకు పిలుపునిచ్చింది రాష్ట్ర చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్. దీనిలో భాగంగా నేటి (బుధవారం, ఏప్రిల్ 1వ తేదీ) రాష్ట్ర వ్యాప్తంగా చికెన్ షాపులను బంద్ చేస్తున్నట్లు వెల్లడించింది. పౌల్ట్రీ కంపెనీలు తమకు ఇచ్చే లాభం (మార్జిన్) తగ్గించడంతో వ్యాపారులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని, ఈ మార్జిన్‌ను పెంచాలని డిమాండ్ చేస్తోంది చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్. గతంలో ఫౌల్ట్రి వాళ్ళు రిటైల్ - మిగతా3లో



## 35 ఏళ్ల తర్వాత 2 స్థానాల్లో మరో అగ్రనేత పోటీ

- జయలలిత బాటలో హీరో విజయ్- 1950లో మొదలైన ట్రెండ్
- తమిళనాడులో 2 స్థానాల్లో పోటీచేసే ట్రెండ్‌కు జయలలిత శ్రీకారం
- ఈసారి పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల్లో బరిలోకి విజయ్
- ఏ స్థానంలో గెలుస్తారనే దానిపై వాడివేడి చర్చ

# అన్ని మతాలు సహనాన్ని, శాంతిని బోధిస్తాయి'

పశ్చిమాసియాలో యుద్ధం అంతకంతకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో టిబెట్ బౌద్ధమత ఆధ్యాత్మిక గురువు, నోబెల్ గ్రహీత దలైలామా కీలక వ్యాఖ్యలు చేశారు. అన్ని మతాలు సహనాన్ని, శాంతిని బోధిస్తాయని తెలిపారు. హింసను ఖండిస్తాయని పేర్కొన్నారు. ఏ ఆధ్యాత్మిక సంప్రదాయంలోనూ హింసకు స్థానం లేదని వెల్లడించారు. అలాగే, మతాల మధ్య కరుణ, సహనం, సామరస్యం వంటి ఉమ్మడి విలువలను ప్రముఖంగా ప్రస్తావించారు. పశ్చిమాసియాలో శాంతి కోసం ఇటీవలే పోప్ లియో–14 చేసిన విజ్ఞప్తిని దలైలామా పునరుద్ఘాటించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "పామ్ సండే ప్రార్థనల సందర్భంగా పోప్–14 శాంతి కోసం శక్తివంతమైన విజ్ఞప్తిని నేను మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నాను. శాంతి కోసం ఆయుధాలను విడిచిపెట్టాలని, హింసను త్యజించాలని ఆయన చేసిన పిలుపు నన్ను ఎంతగానో కదిలించింది. ఎందుకంటే అన్ని ప్రధాన మతాలు ఇదే సారాంశాన్ని భోదిస్తాయి. క్రైస్తవ మతం, బౌద్ధ మతం, ఇస్లాం, హిందూ మతం, యూదు మతం లేదా ప్రపంచంలోని ఏ గొప్ప ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని చూసినా వాటి సందేశం ప్రాథమికంగా ఒక్కటే. ప్రేమ, కరుణ, సహనం ఆత్మ నిగ్రహం. ఈ మతాల బోధనలలో దేనిలోనూ హింసకు స్థానం లేదు. హింస మరింత హింసను మాత్రమే సృష్టిస్తుంది. అది శాంతికి ఎప్పటికీ శాశ్వత పునాది కాదని చరిత్ర మనకు పదేపదే తెలియజేసింది. " అని దలైలామా అభిప్రాయపడ్డారు.

**యావత్ ప్రపంచ ప్రజలు శాంతి కోసం కృషి చేయాలి : దలైలామా**

ప్రపంచ ఐక్యతకు టిబెట్ బౌద్ధమత ఆధ్యాత్మిక గురువు



దలైలామా పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు శాంతి కోసం కృషి చేయాలని కోరారు. పశ్చిమాసియా సహా ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న హింస, సంఘర్షణలు త్వరగా ముగియాలని ఆకాంక్షించారు. "పశ్చిమాసియా, రష్యా–ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న సంఘర్షణలకు శాశ్వత పరిష్కారం చర్చలు, దౌత్యం, పరస్పర గౌరవంపై ఆధారపడి ఉంటుంది. మనమందరం తోబుట్టువులమనే అవగాహనతో ఈ సంఘర్షణలను పరిష్కరించుకోవాలి." అని దలైలామా అభిప్రాయపడ్డారు.

**శాంతికి పిలుపునిచ్చిన పోప్**

కొద్ది రోజుల క్రితం రోమ్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో జరిగిన పామ్ సండే ప్రార్థనల సందర్భంగా పశ్చిమాసియా సంక్షోభం గురించి పోప్ లియో–14 పరోక్షంగా స్పందించారు. యుద్ధం చేసేవారి ప్రార్థనలను దేవుడు (యేసు క్రీస్తు) ఆలకించడని అన్నారు. పైగా ఆ ప్రార్థనలను తిరస్కరిస్తాడని చెప్పారు. పీడితుల పక్షాన దేవుడు నిలుస్తాడని తెలిపారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా శాంతికి పిలుపునిచ్చారు.

**జీసస్ యుద్ధాన్ని తిరస్కరిస్తాడు : పోప్ లియో–14**

"సోదర సోదరీమణులారా మన దేవుడు యేసు శాంతికే రాజు. ఆయన యుద్ధాన్ని తిరస్కరిస్తాడు. యుద్ధాన్ని సమర్థించుకోవడానికి యేసును ఎవరూ ఉపయోగించుకోలేరు. జీసస్ యుద్ధం చేసేవారి ప్రార్థనలను వినడు. వాటిని తిరస్కరిస్తాడు. పశ్చిమాసియాలోని క్రైస్తవుల కోసం నేను ప్రత్యేకంగా ప్రార్థిస్తున్నాను. వారు ఈ పవిత్ర దినాల ఆచారాలను పాటించలేకపోతున్నారు." అని పోప్ లియో–14 పేర్కొన్నారు. ఈ క్రమంలో పోప్ చేసిన శాంతి విజ్ఞప్తిని దలైలామా సమర్థిస్తూ సోషల్ మీడియాలో తాజాగా పోస్ట్ పెట్టారు. పోప్ లియో–14 చేసిన వ్యాఖ్యలపై స్పందించని అమెరికా వైట్‌హౌస్ పత్రికా కార్యదర్శి కరోలిన్ లివిట్‌ను విలేకరులు అడిగారు. ఈ క్రమంలో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. "అమెరికా దాదాపు 250 ఏళ్ల క్రితం యూదు–క్రైస్తవ విలువలే పునాదిగా స్థాపితమైంది. యూఎస్ చరిత్రలో అత్యంత కష్టకాలాల్లో అధ్యక్షులు, యుద్ధ శాఖ అధిపతులు, దేశ సైనికులు ప్రార్థనలు చేయడం మనం చూశాం. అమెరికా సైన్యాధిపతి గానీ, స్వయంగా అధ్యక్షుడు గానీ దేశ సైనికుల కోసం, అలాగే విదేశాల్లో ఉంటూ మన దేశానికి సేవలందిస్తున్న వారి కోసం ప్రార్థించమని అమెరికన్ ప్రజలకు పిలుపునివ్వడంలో ఎటువంటి తప్పు ఉందని నేను భావించడం లేదు. వాస్తవానికి అది ఒక అత్యంత గొప్ప కార్యమని నేను భావిస్తున్నాను" అని కరోలిన్ లివిట్ అభిప్రాయపడ్డారు.

# బంగాల్‌లో రాజకీయ వారసులదే హవా

మమతా బెనర్జీ నుంచి బుద్ధదేవ్ భట్టాచార్జీ వరకు, సోమేన్ మిత్రా, ప్రియా రంజన్ దాస్ మున్షీ నుంచి బిమన్ బోస్ వరకు బంగాల్‌కు చెందిన ఎందరో ప్రముఖ నేతలు విద్యార్థి రాజకీయాలు, కార్మిక పోరాటాలు, ప్రజా ఉద్యమాల ద్వారానే ఎదిగారు. కానీ ఇప్పుడీ రాష్ట్రంలోనూ రాజకీయ సంస్కృతి మారుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ సహా అన్ని పార్టీల్లోనూ వారసత్వ రాజకీయాల జాడ కనిపిస్తోంది. ఈసారి ఈ పార్టీలన్నీ ఎంతోమంది రాజకీయ వారసులకు సగౌరవంగా అసెంబ్లీ టికెట్లను ఇచ్చుకున్నాయి. పార్టీలవారీగా టికెట్లను పొందిన ప్రముఖ రాజకీయ వారసులు ఎవరు? వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించాల్సిన అనివార్య స్థితికి పార్టీలు ఎందుకు చేరాయి? స్వశక్తితో ఎదిగే కొత్త తరం నేతల పరిస్థితేంటి? ఈ కథనంలో తెలుసుకుందాం.

**గతమెంతో ఘనం : దారితప్పిన రాజకీయం**

గతంలో బంగాల్ పాలిటిక్స్ యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచేవి. ఈ రాష్ట్రాన్ని వివిధ కాలాల్లో దాదాపు 25 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ పాలించింది. ఇక వామపక్ష కూటమి (లెఫ్ట్ ఫ్రంట్) వరుసగా 34 సంవత్సరాల పాటు (1977 నుంచి 2011 వరకు) పాలించింది. అప్పట్లో బంగాల్ రాష్ట్ర కాంగ్రెస్ కానీ, వామపక్షాలు కానీ వారసత్వ రాజకీయాలను పెద్దగా ప్రోత్సహించేవి కావు. ఈ కారణం వల్లే ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని మమతా బెనర్జీ, బుద్ధదేవ్ భట్టాచార్జీ, సోమేన్ మిత్రా, ప్రియా రంజన్ దాస్ మున్షీ, బిమన్ బోస్ లాంటి నేతలకు ఎన్నికల్లో పోటీచేసే అవకాశాలు లభించాయి. కానీ ఇప్పుడు బంగాల్‌లో అన్ని పార్టీలూ ఇంటి పేరును, రాజకీయ నేపథ్యాన్ని, ధన బలాన్ని చూసి అసెంబ్లీ టికెట్లు ఇవ్వడం మొదలుపెట్టాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీలు విడుదల చేసిన అభ్యర్థుల జాబితాల్లో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తోంది. వాటిలో రాజకీయ ప్రముఖుల కుమారులు, కుమార్తెలు, సోదరులు, జీవిత భాగస్వాముల పేర్లు ఎన్నో కనిపిస్తున్నాయి.

**వారసత్వ రాజకీయాలపై పార్టీల యూటర్న్**

"ఒకప్పుడు వారసత్వ రాజకీయాలను చాలా వరకు పార్టీలు విమర్శించేవి. కానీ ఇప్పుడు ఏ పార్టీ కూడా వాటిని విమర్శించే స్థితిలో లేదు. ఎందుకంటే అన్ని పార్టీలూ వారసత్వ రాజకీయాలకే పెద్దపీట వేస్తున్నాయి. రాజకీయ నేపథ్యం కలిగిన గెలుపు గుర్రాలను (అభ్యర్థులను) తప్ప మరే విషయాన్ని పార్టీలు పెద్దగా పట్టించుకోవడం లేదు. వారసత్వ రాజకీయాలకు తాము వ్యతిరేకమని గట్టిగా చెప్పుకునే బీజేపీ, వామపక్షాలు కూడా ఇప్పుడు యూటర్న్ తీసుకున్నాయి. అందువల్లే బంగాల్ రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. ఒకప్పుడు రాష్ట్రంలోని విద్యార్థి సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజా ఉద్యమాల నుంచి నేతలు ఎదిగేవారు. ఇప్పుడు కూడా అలాంటి ప్రజా నేతలున్నా, రాజకీయ పార్టీలు వాళ్లకు ఎన్నికల్లో పోటీచేసే



అవకాశాలను ఇవ్వడం లేదు" అని కోల్‌కతాకు చెందిన రాజకీయ విశ్లేషకుడు సుమన్ భట్టాచార్య తెలిపారు.

**విద్యార్థి యూనియన్లు బలహీనపడటంతో రాజకీయ శూన్యత**

"ప్రత్యేకించి బంగాల్‌లోని యూనివర్సిటీల విద్యార్థి యూనియన్లు బాగా బలహీనపడ్డాయి. ఇందువల్లే రాజకీయాల్లోకి ప్రవేశించే కొత్తతరం సంఖ్య తగ్గిపోయింది. రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఏర్పడింది. ఒకప్పుడు జిల్లా స్థాయి నేత, విద్యార్థి నేత కూడా ఎమ్మెల్యే కావాలని కలలు కనేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎన్నికలు డబ్బుమయం అయ్యాయి. రాజకీయ వారసత్వం కలిగిన వారికి ధన బలం ఉంటుంది. దానితో వాళ్లు పార్టీల టికెట్‌లను సాధిస్తున్నారు. ఎన్నికల్లో పోటీచేసి గెలుస్తున్నారు. పార్టీలు కూడా ఇలాంటి వాళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నాయి" అని రాజకీయ విశ్లేషకుడు సుమన్ భట్టాచార్య చెప్పారు.

**గెలుపు అవకాశాల ప్రకారమే టికెట్ల కేటాయింపు : టీఎంసీ వర్గాలు**

"ఇప్పుడు అసెంబ్లీ టికెట్ల కేటాయింపు ప్రమాణాలు మారిపోయాయి. సైద్ధాంతికతతో పాటు పార్టీకి విధేయత, సుస్థిరమైన ప్రజా నెట్‌వర్క్ ఉన్నవారికే టికెట్లను ఇస్తున్నారు. ప్రజలు వారసత్వ రాజకీయాలను విమర్శిస్తుంటారు. కానీ అభ్యర్థులకు టికెట్లు ఇచ్చేటప్పుడు రాజకీయ పార్టీలు ప్రధానంగా ఆలోచించేది, ఎన్నికల్లో గెలుపు అవకాశాల గురించే. ఎవరైనా రాజకీయ నేతకు కుటుంబం ద్వారా నియోజకవర్గంలో ఇప్పటికే పట్టు ఉంటే, పార్టీ దాన్ని ఒక అడ్వాంటేజీగా పరిగణిస్తుంది. ప్రజా గుర్తింపు, కార్యకర్తల ఫాలోయింగ్ ఉన్నవాళ్లకే టికెట్లు లభిస్తాయి" అని పలువురు టీఎంసీ పార్టీ సీనియర్ నేతలు ఈటీవీ భారత్?తో చెప్పుకొచ్చారు.

**2026 పోల్స్ : బీజేపీ టికెట్లు పొందిన రాజకీయ వారసులు**

పూర్వ మేదినీపూర్ జిల్లాలోని ఎగ్రా అసెంబ్లీ స్థానాన్ని దివ్యేందు అధికారికి బీజేపీ కేటాయించింది. ఈయన సాక్షాత్తూ బీజేపీ నేత సువేందు అధికారి తమ్ముడే. సువేందు అధికారి సైతం ఈ ఎన్నికల్లో నందిగ్రామ్, భవానీపుర్ స్థానాల్లో పోటీ చేస్తున్నారు. అంటే ఒక్క కుటుంబానికే బీజేపీ 3 అసెంబ్లీ టికెట్లు ఇచ్చుకుంది.

గైఘాటా సిట్టింగ్ ఎమ్మెల్యే సుబ్రతా ఠాకూర్ ఈసారి మతువా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఈయన కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ శాంతను ఠాకూర్ సోదరుడు. పలుకుబడిగల ఠాకూర్ కుటుంబానికి చెందినవారు. ఇక బగ్దా నుంచి బీజేపీ అభ్యర్థిగా శాంతను ఠాకూర్ భార్య సోమా పోటీ చేస్తున్నారు. ఈ స్థానంలో సోమాతో స్వయంగా ఆమె వదిన మధుపర్ణ (టీఎంసీ) తలపడుతున్నారు.

మాజీ ఎంపీ అర్జున్ సింగ్ కుమారుడు పవన్ సింగ్‌కు భట్‌పారా స్థానాన్ని బీజేపీ కేటాయించింది. ఇక అర్జున్ సింగ్ నోవాపారా స్థానం నుంచి పోటీ చేయనున్నారు.

బారానగర్ అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా సజల్ ఘోష్ బరిలోకి దిగారు. ఈయన కాంగ్రెస్ మాజీ నాయకుడు ప్రదీప్ ఘోష్ కుమారుడు.

**వ్యక్తులకు పార్టీల్లో ప్రాధాన్యత పెరిగింది : బీజేపీ వర్గాలు**

"బంగాల్‌లో రాజకీయాలు చాలా మారాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు వ్యక్తులకు పార్టీల్లో ప్రాధాన్యత పెరిగింది. అందుకే రాజకీయ పలుకుబడి ఉన్న కుటుంబాలకు టికెట్ల కేటాయింపులో ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోంది" అని సీనియర్ బీజేపీ నేత ఒకరు చెప్పారు.

**కాంగ్రెస్ టికెట్లు పొందిన రాజకీయ వారసులు**

బంగాల్‌లో ఉనికిని చాటుకునేందుకు పోరాడుతున్న కాంగ్రెస్ కూడా వారసత్వ రాజకీయాలకే ప్రాధాన్యతను ఇస్తోంది.

కాంగ్రెస్ దిగ్గజం ఏబీఏ ఘనీ ఖాన్ చౌదరి మేనకోడలు, మాజీ ఎంపీ మౌసమ్ నూర్ గతంలో టీఎంసీ పార్టీలో ఉండేవారు. ఆమె ఈసారి మాలతీపుర్ అసెంబ్లీ స్థానం కోసం కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారు. "ఇది భావోద్వేగభరితమైన క్షణం. నా సొంత ఇంటికి మళ్లీ వచ్చినట్టుగా ఉంది. మా కుటుంబాన్ని ఏకం చేసి, ఘనీ ఖాన్ చౌదరి వారసత్వాన్ని బలోపేతం చేయాలని భావిస్తున్నాను" అని మౌసమ్ నూర్ పేర్కొన్నారు.

పురూలియాలోని బగ్ముండి స్థానంలో కాంగ్రెస్ మాజీ ఎంపీ దేబేంద్ర మహతో కుమారుడు నేపాల్ మహతోను బరిలోకి దింపారు. బల్లిగంజ్ స్థానంలో మాజీ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సోమేన్ మిత్రా కుమారుడు రోహన్ మిత్రాకు టికెట్‌ను కేటాయించారు. ఉత్తర బంగాల్‌లోని గోల్‌పోఖర్ స్థానం నుంచి అలీ ఇమ్రాన్ రామ్జ్ పోటీ చేస్తున్నారు. ఆయన మాజీ ఫార్వర్డ్ బ్లాక్ ఎమ్మెల్యే మహమ్మద్ రంజాన్ అలీ కుమారుడు.

2026 పోల్స్ : సీపీఎం టికెట్లు పొందిన రాజకీయ వారసులు

వామపక్షాలు ఒకప్పుడు వారసత్వ రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించేవి. కానీ ఇప్పుడవి యూటర్న్ తీసుకున్నాయి.

రాజర్‌హాట్–న్యూ టౌన్ స్థానంలో మాజీ మంత్రి గౌతమ్ దేబ్ కుమారుడు సప్తర్షి దేబ్‌కు సీపీఎం టికెట్‌ను కేటాయించింది. మాజీ ఎమ్మెల్యే పద్మా నిధి ధర్ మనవరాలు దీప్సితా ధర్ నార్త్ దమ్ దమ్ స్థానం నుంచి సీపీఎం తరఫున పోటీ చేస్తున్నారు.

# బంగాల్‌లో ఓటర్ల హక్కులకు ముప్పు

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికల కమిషన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో నిజమైన ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు మూడు పేజీల లేఖ రాసిన మమత, ఈసీ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కులను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. "ఒక రాజ్యాంగ సంస్థ నుంచి ఆశించే ప్రమాణాలు ఇవి కావు" అని ఆమె లేఖలో స్పష్టం చేశారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించడం ఈసీ బాధ్యత అని గుర్తుచేశారు. ఇక బంగాల్‌లో ఎన్నికలు రెండు దశల్లో జరగనున్నాయి. ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరుగగా, మే 4న ఫలితాలు వెల్లడించనున్నారు. ఇదే సమయంలో, బీజేపీపై కూడా మమతా ఘాటు విమర్శలు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ ఓటర్లను బంగాల్ ఓటర్ల జాబితాలో చేర్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బిహార్, రాజస్థాన్, హరియాణా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఓటర్లను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.

**బీజేపీకి బంగాల్ ప్రజలపై గౌరవం లేదు!**

పశ్చిమ మేదినిపుర్ జిల్లా చంద్రకోణాలో జరిగిన ఎన్నికల సభలో మాట్లాడిన మమతా, ఒక్క రోజులోనే సుమారు 30 వేల కొత్త ఓటర్ల నమోదు ఫారాలు సమర్పించారని తెలిపారు. దీనిపై సమాచారం అందడంతో అభిషేక్ బెనర్జీ తన ప్రచారాన్ని మధ్యలో వదిలి ఈసీ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. బీజేపీకి బంగాల్ ప్రజలపై గౌరవం లేదని, ఎన్నికల్లో గెలవడానికి ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉందని మమతా విమర్శించారు. ూ×= ప్రక్రియ పేరుతో మహిళలు, మైనారిటీల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు.

**నాన్ వెజ్‌పై నిషేధం విధించే ప్రమాదం**

"బీజేపీ, ఈసీ కలిసి ప్రజల పౌరసత్వం, రాజ్యాంగ హక్కులను లాక్కుంటున్నాయి. దీనికి వ్యతిరేకంగా మేము చివరి వరకు పోరాడుతాం" అని మమత స్పష్టం చేశారు. అలాగే, బీజేపీ అధికారంలోకి వస్తే బంగాల్? ప్రజల ఆహారపు అలవాట్లపై కూడా నియంత్రణలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రత్యేకంగా నాన్–వెజ్ ఆహారంపై నిషేధం విధించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చీ=జ అమలు చేయాలని చూస్తోందని, అయితే తమ ప్రభుత్వం ఉన్నంత కాలం బంగాల్?లో చీ=జకి అనుమతి ఇవ్వబోమని మమత తేల్చి చెప్పారు. డిటెన్షన్ క్యాంపుల ఏర్పాటుకు కూడా తాము వ్యతిరేకమని తెలిపారు. ఇంకా బ్యాంకురా, బిష్ణుపుర్, గర్బేటా ప్రాంతాల్లో జరిగిన సభల్లో మమతా బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. లక్షలాది నిజమైన ఓటర్ల పేర్లు తొలగించారని, అల్లర్లకు ప్రోత్సాహం ఇచ్చారని, రాష్ట్రానికి రావాల్సిన నిధులను అడ్డుకున్నారని ఆరోపించారు.

బంగాలీ మాట్లాడే వలస కార్మికులను వేధిస్తోందంటూ!

బీజేపీ ఒక బార్బరిక్ పార్టీ అని, బంగాలీ మాట్లాడే వలస కార్మికులను వేధిస్తోందని మమతా విమర్శించారు. బెంగాల్ యువత ప్రతిభ, సంస్కృతి, విజయాలపై బీజేపీకి అసూయ ఉందని వ్యాఖ్యానించారు. తనను కొనుగోలు చేయలేరనే కారణంతోనే బీజేపీ నాయకులు తనను ద్వేషిస్తున్నారని కూడా మమతా పేర్కొన్నారు. ఇక ఈ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థులెవరో పట్టించుకోకుండా, తానే అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థినిగా భావించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. మరోవైపు, బీజేపీ నకిలీ ఓటర్ల నమోదు చేసిందంటూ టీఎంసీ ఆరోపించిన నేపథ్యంలో విచారణ జరుపుతామని బంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్ తెలిపారు.

## ప్రపంచ మార్కెట్‌లో విశ్వసనీయ సెమీకండక్టర్ సప్లయర్‌గా భారత్

దేశంలోని ప్రతి ఉత్పత్తి రంగంలో స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా గత బడ్జెట్లో తాము సెమీకండక్టర్ మిషన్ 2ను ప్రారంభించామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గుజరాత్‌లోని సనంద్‌లో కైనెస్ సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపచం సెమీకండక్టర్ సప్లై చైన్?లో ఒక భారతీయ కంపెనీ చేరడం చాలా గర్వకారణమని అన్నారు. ప్రపంచ మార్కెట్లో విశ్వసనీయ సెమీకండక్టర్ సరఫరాదారుగా భారత్ తన పాత్రను బలోపేతం చేసుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కొవిడ్?–19 మహమ్మారి సమయంలో సరఫరా గొలుసులో అంతరాయం ఏర్పడినప్పుడు, భారత్ సెమీకండక్టర్ తయారీకి కేంద్రంగా మారాలని మా ప్రభుత్వం నిర్ణయించుకుంది. అందుకే భారత్? 2021లో సెమీకండక్టర్ మిషన్?ను ప్రారంభించిందని ఆయన అన్నారు. అయితే ఇది కేవలం ఒక పారిశ్రామిక విధానం మాత్రమే కాదని, భారతదేశ ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. 21వ శతాబ్దపు మార్పులకు భారత్ కేవలం ఒక సాక్షిగా కాకుండా, ఆ మార్పునకు నాయకత్వం వహించే సంకల్పంతో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. మంగళవారం గుజరాత్‌లోని సనంద్‌లో కైనెస్ సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. మైక్రాన్ ప్లాంట్ తర్వాత దేశంలో అందుబాటులోకి వచ్చిన రెండో అతిపెద్ద సెమీకండక్టర్ యూనిట్ ఇదే కావడం విశేషం. సుమారు రూ.3,300 కోట్ల పెట్టుబడితో నిర్మించిన ఈ ప్లాంట్, చిప్‌ల తయారీలో భారతదేశాన్ని స్వావలంబన దిశగా నడిపించనుంది. ఇక్కడ ప్రధానంగా అడ్వాన్స్‌డ్ ఇంటెలిజెంట్ పవర్ మాడ్యూల్స్–'ఐపీఎం'లను తయారు చేస్తారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పారిశ్రామిక మోటార్ డ్రైవ్‌లు, గృహోపకరణాల్లో విద్యుత్ వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించడానికి ఈ ఐపీఎంలు ఎంతో కీలకం. ఆటోమోటివ్, ఇండస్ట్రియల్ అప్లికేషన్లకు అవసరమైన కాంపాక్ట్, రిలయబుల్ పవర్ స్విచింగ్ సెమీకండక్టర్లను ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి చేయనున్నారు. అన్ని దశలు పూర్తయిన తర్వాత ఈ ప్లాంట్ నుంచి రోజుకు 63.3 లక్షల యూనిట్ల ఉత్పత్తి జరగనుంది. భారత చిప్ ఎకోసిస్టమ్‌లో ఉన్న అంతరాన్ని పూరించడమే కాకుండా, ప్రపంచ సెమీకండక్టర్ మార్కెట్‌లో భారత్ కీలక శక్తిగా ఎదగడానికి ఈ ప్లాంట్ దోహదపడనుంది.

**సమ్రాట్ సంప్రతి మ్యూజియం ప్రారంభం**

మరోవైపు, మహావీర్ జయంతిని పురస్కరించుకుని గుజరాత్‌లోని కోబా గ్రామంలో నిర్మించిన సమ్రాట్ సంప్రతి మ్యూజియంను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. మహావీర్ జైన ఆరాధన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ మ్యూజియాన్ని జైన గురువుల సమక్షంలో మోదీ ఆవిష్కరించారు. జైన వారసత్వం, అహింసా విలువల చాటిచెప్పేలా ఈ మ్యూజియాన్ని తీర్చిదిద్దారు. ఈ మ్యూజియానికి మౌర్య చక్రవర్తి అశోకుడి మనవడైన సమ్రాట్ సంప్రతి మహారాజ్ పేరు పెట్టారు. మ్యూజియంలో ప్రాచీన భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రదర్శించే 2వేల కన్నా ఎక్కువ అరుదైన కళాఖండాలు ఉన్నాయి. శతాబ్దాల నాటి రాతి, లోహ విగ్రహాలు, పురాతన రాతప్రతులు, నాణేలలను ఇక్కడ పొందుపర్చారు. సందర్శకులకు సరికొత్త అనుభూతిని అందించడానికి అత్యాధునిక ఆడియో–విజువల్ టెక్నాలజీని ఇక్కడ వినియోగించారు. వాటన్నిటినీ ప్రధాని మోదీ సందర్శించారు. అక్కడి జైన మతగురువులతో సంభాషించారు.

## ఎల్‌డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారు

భారత్– అమెరికా వాణిజ్య ఒప్పందంతో దేశ భవిష్యత్‌ను ప్రధాని నరేంద్ర మోదీ తాకట్టు పెట్టారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ ఒప్పందం వల్ల దేశ రైతులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆక్షేపించారు. కేరళలోని కన్నూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ గాంధీ, బీజేపీకి లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్‌కి మధ్య చీకటి ఒప్పందం ఉందన్నారు. ఆ రెండింటితో కాంగ్రెస్ నేతృత్వంలోని ఖణఖీ పోరాడుతోందని వెల్లడించారు. సీపీఐ (ఎం) ఏమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలు బీజేపీతో జత కట్టారని విమర్శించారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ాణఖీ గెలవాలని నరేంద్ర మోదీ కోరుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు.

నరేంద్ర మోదీని డొనాల్డ్ ట్రంప్ ఎలాగైతే నియంత్రిస్తున్నారో అలాగే కేరళ ముఖ్యమంత్రిని ప్రధాని నియంత్రిస్తున్నారు. తన కేసు విషయంలో నరేంద్ర మోదీ చర్యలు తీసుకోవడం లేదని కేరళ సీఎంకు తెలుసు. తనను జైలులో ఉంచేందుకు కావాల్సిన తాళం చెవి మోదీ దగ్గర ఉందని కూడా కేరళ సీఎంకు తెలుసు. నరేంద్ర మోదీని కాంగ్రెస్, రాహుల్ గాంధీ విమర్శించడం మీరు చూస్తారు. కానీ, మోదీని కేరళ సీఎం విమర్శించడం మీరు అసలే చూడలేరు. అలానే కేరళ సీఎంను మోదీ విమర్శించడం కూడా చూడరు.

**శబరిమల గోల్డ్ స్కాంపై మోదీ మాట్లాడరేం?**

ఇతర చోట్ల మతం, దేవుడి గురించి మాట్లాడే మోదీ కేరళలో మాత్రం ఆ విషయాలను ప్రస్తావించరని రాహుల్ గాంధీ ఆరోపించారు. శబరిమల ఆలయంలో జరిగిన బంగారు తాపడాల కుంభకోణం గురించి ఇప్పటివరకు ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బంగారు తాపడాలు మాయమవడం వెనక సీపీఐ నేతల హస్తం ఉన్నందువల్లే ఈ విషయంలో బీజేపీ మౌనంగా ఉందని వ్యాఖ్యానించారు. బీజేపీతో సీపీఐ జత కట్టడం ఆ పార్టీలోని కొందరు సీనియర్ నేతలకు నచ్చలేదని, అందువల్లే వారు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్రులుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని అన్నారు.

బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న వారిపై దాడి జరుగుతుందని రాహుల్ గాంధీ చెప్పారు. "నాపై 36 కేసులు ఉన్నాయి. నా ఇంటిని లాక్కున్నారు. నా లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశారు. ఈడీ నన్ను 55 గంటల పాటు విచారించింది. ఒకవేళ ముఖ్యమంత్రి విజయన్? నిజంగానే కాషాయ పార్టీకి ముప్పు అయితే ఆయనపై ఎన్నో ఏళ్లుగా ఉన్న అవినీతి కేసుల్లో కేంద్ర ఏజెన్సీలు ఎందుకు చర్యలు తీసుకోలేకపోయాయి. ఆయన పిల్లలను ఎందుకు విచారించలేదో నాకు చెప్పండి? ఆయనపై ఎందుకు దాడి జరగడం లేదో నాకు వివరించండి?" అని రాహుల్ గాంధీ అన్నారు.

## 35 ఏళ్ల తర్వాత 2 స్థానాల్లో మరో అగ్రనేత పోటీ

తమిళనాడు ఎన్నికల్లో 35 ఏళ్ల గ్యాప్ తర్వాత మరో అగ్రనేత రెండు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయబోతున్నారు. ఈ అసెంబ్లీ పోల్స్‌లో పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల్లో తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధినేత, హీరో విజయ్ బరిలోకి దిగారు. చివరిసారిగా 1991లో మాజీ సీఎం జయలలిత(అన్నా డీఎంకే) బర్గూర్, కంగేయం స్థానాల్లో పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత కంగేయం స్థానానికి రాజీనామా చేసి, బర్గూర్ ఎమ్మెల్యేగా కొనసాగారు. ఆ తర్వాత మరో అగ్రనేత ఎవరూ రెండు స్థానాల్లో పోటీ చేయలేదు. మళ్లీ ఇన్నాళ్లకు దళపతి విజయ్ రెండు స్థానాల్లో పోటీకి సిద్ధమయ్యారు. అయితే, ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ ఎలాంటి ఫలితాన్ని సాధిస్తారు? జయలలిత లాగే డబుల్ ధమాకాను సొంతం చేసుకుంటారా? అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. రెండు అసెంబ్లీ లేదా లోక్‌సభ స్థానాల నుంచి రాజకీయ అగ్రనేతలు పోటీ చేసే సంప్రదాయం 1950వ దశకం చివర్లోనే మొదలైంది. 1957 లోక్‌సభ ఎన్నికల్లో మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి తన సొంత రాష్ట్రం ఉత్తర్?ప్రదేశ్‌లోని బలరాంపూర్, మధుర స్థానాల నుంచి పోటీ చేశారు. ఆయన మధుర స్థానంలో ఓడిపోగా, బలరాంపూర్‌లో గెలిచారు. తదనంతర కాలంలో ఈ విధంగా రెండు లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేసిన ప్రముఖ నేతల్లో ములాయం సింగ్ యాదవ్, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, నరేంద్ర మోదీ ఉన్నారు.

**తమిళనాడులో జయలలితతోనే నాంది**

తమిళనాడు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల చరిత్రను ఓసారి పరిశీలిస్తే, 2 స్థానాల్లో పోటీచేసిన తొలి నాయకురాలిగా జయలలిత నిలిచారు. అన్నా డీఎంకే పార్టీ అధినేత్రి హోదాలో 1991లో బర్గూర్, కంగేయం స్థానాల్లో ఆమె పోటీచేశారు. రెండుచోట్లా గెలిచి తన రాజకీయ సత్తాను చాటుకున్నారు. కంగేయం స్థానానికి రాజీనామా చేసి, బర్గూర్ ఎమ్మెల్యేగా కంటిన్యూ అయ్యారు. అయితే ఆ తర్వాత ఎప్పుడూ రెండు స్థానాల్లో జయలలిత పోటీ చేయలేదు. కానీ అనూహ్యంగా 1996 అసెంబ్లీ ఎన్నికల్లో బర్గూర్ స్థానంలో జయలలిత ఓటమిని ఎదుర్కొన్నారు. జయలలితపై డీఎంకే అభ్యర్థి సుగవనం గెలిచారు.

**2001లో నాలుగు స్థానాల్లో జయ నామినేషన్లు**

1996లో మన దేశంలో కీలకమైన ఎన్నికల సంస్కరణలు జరిగాయి. ఒక వ్యక్తి 2 స్థానాల(అసెంబ్లీ, లోక్‌సభ)కు మించి పోటీ చేయకూడదని ఆ సంస్కరణలు నిర్దేశించాయి. అయినప్పటికీ 2001 అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా నాలుగు స్థానాల్లో (పుదుక్కొట్టై, భువనగిరి, క్రిష్ణగిరి, ఆండిపట్టి) జయలలిత నామినేషన్లు దాఖలు చేశారు.

# కోడి కూర తినేదెలా?

-మొదటిపేజీ తరువాయి

షాపులకు కేజీకి 26 రూపాయలు మార్జిన్ ఇచ్చే వారని, గత 20 ఏళ్ళుగా 26 రూపాయలే మార్జిన్ ఉందని, కానీ ఇటీవల మార్జిన్‌ను16 రూపాయలకు తగ్గించారని, ప్రస్తుతం కేజీ చికెన్‌కు మార్జిన్ 30 రూపాయలు చేయాలని డిమాండ్ చేస్తుంది. చికెన్ ప్రియులకు ఇది గుండె పలిగే వార్తే. రాష్ట్రంలో నేటి నుంచి చికెన్ దుకాణాలు మూతపడనున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు రిటైల్ షాపులకు కమీషన్ తగ్గించాయని వెంటనే వాటిని పెంచాలని డిమాండ్ చేస్తూ అప్పటివరకు దుకాణాలు మూసివేయాలని చికెన్ షాపుల అసోసియేషన్ నిర్ణయించింది. తమకు న్యాయం చేయాలంటూ నేటి మహాధర్నాకు పిలుపునిచ్చారు. కిలో చికెన్‌పై ప్రస్తుతం ఇస్తున్న మార్జిన్‌ను రూ. 26ను రూ.30 వరకు పెంచాలన్నది వారి ప్రధాన డిమాండ్. దీనికోసమే రేపటి నుంచి తెలంగాణ వ్యాప్తంగా చికెన్ షాప్‌ల బంద్ చేపట్టాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లోని తార్నాకలో ఏర్పాటు చేసిన రాష్ట్ర చిల్లర దుకాణాల యజమానుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.




**పౌల్ట్రీ కంపెనీలు స్పందించాలి**

రోజురోజుకు పెరుగుతున్న అద్దెలు, కూలీల జీతాలు, విద్యుత్తు బిల్లులు, రవాణా ఛార్జీల నిర్వహణ భారంగా పరిణమిస్తున్న నేపథ్యంలో కంపెనీలు చెల్లించే మార్జిన్ న్యాయబద్ధంగా లేదని, తమకు నష్టాలే మిగులుతున్నాయని అసోసియేషన్ ఆక్షేపించింది. రేపు ఉదయం 9 గంటల నుంచి దుకాణాలు బంద్ చేసి ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేయబోతున్నట్లు సభ్యులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, పౌల్ట్రీ కంపెనీలు స్పందించాలని తెలంగాణ రాష్ట్ర చిల్లర దుకాణాల యజమానుల సంఘం డిమాండ్ చేసింది.

చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ తమకు ముందుగా తమకు ప్రజలు సహకరించాలని కోరుతున్నట్లు తెలిపారు. గత 20 ఏళ్లుగా పౌల్ట్రీ కంపెనీలు రిటైల్? షాప్?లకు ఇస్తున్న మార్జిన్‌లో ఇప్పుడు కోత విధించి చిన్న చిన్న దుకాణాలను లేకుండా చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఆలోచనను పౌల్ట్రీ కంపెనీలు మానుకోవాలని సూచించారు. మార్జిన్‌లో ఎటువంటి కోత పెట్టకూడదన్నారు.

**జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నాం**

20 ఏళ్ల క్రితం, ప్రస్తుత కాలంలో చాలా మార్పులున్నాయని, గతంలో కూలీలకు 5 నుంచి 6 వేల వరకు జీతాలు ఇచ్చేవారమని ఇప్పుడు ఒక్కరికే 20 నుంచి 25 వేల వరకు చెల్లిస్తున్నామని అన్నారు. ఇలా ఒక్కో షాపులో ముగ్గురు వర్కర్లు పని చేస్తున్నారని చెప్పారు. ఇప్పుడు నష్టాలు వస్తున్న నేపథ్యంలో వాళ్లకు కూడా జీతాలు చెల్లించే పరిస్థితి లేదని వాపోయారు. ఎంత మార్జిన్ ఇస్తే వర్కౌట్? అవుతుందనే విషయం పౌల్ట్రీ కంపెనీలకు తెలుసన్నారు. కానీ కావాలనే ఈ చిన్న చిన్న దుకాణాలను లేకుండా చేయాలని చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వేరే దగ్గరకు వెళ్లి బిజినెస్ పెట్టుకుని చేసే పరిస్థితి లేదని తెలంగాణ చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు అన్నారు. ప్రభుత్వం కూడా తమ ప్రభుత్వంపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నట్లు తెలిపారు. రేపు హైదరాబాద్?లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేయబోతున్నట్లు ప్రకటించారు. అన్ని జిల్లాల నుంచి చికెన్? షాపు దుకాణాదారులు పాల్గొంటారని తెలిపారు. శాంతియుతంగా తమ నిరసన ఉంటుందన్నారు. తమకు న్యాయమైన మార్జిన్ వచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**మార్జిన్ పెంచేవరకు పోరాటం**

తాము ఇప్పుడు కేవలం కిలో చికెన్?పై రూ.4 మార్జిన్ పెంచమని అడుగుతున్నట్లు తెలిపారు. అది కూడా వెయిట్ లాస్ పోతుందని చెప్పారు. తమలాంటి చిన్నచిన్న షాపులకు ఎటువంటి డిమాండ్లు ఉండవన్నారు. ఇప్పుడు పౌల్ట్రీ రంగం మొత్తం కార్పొరేట్ అయ్యిందని వాపోయారు. తమకు న్యాయమైన మార్జిన్ ఇచ్చేవరకు ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ లబ్ధిదారులకు గుడ్‌న్యూస్

-మొదటిపేజీ తరువాయి

పూర్తయిన దశ ఫొటోలను తీసి అప్‌లోడ్ చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఇబ్బందులను గమనించిన సర్కారు సడలింపు ఇచ్చింది. ఇంటి నిర్మాణంలో బయట గోడలకు ప్లాస్టరింగ్ చేసి, లోపల చేయకున్నా, లేదంటే బయట ప్రాథమిక కోటింగ్ వేసి, లోపల వేయలేకపోయినా, అన్ని గదుల్లో గచ్చు లేకపోయినా, ముందు దర్వాజ తలుపులు ఉండి, లోపలి గదులకు తలుపులు ఏర్పాటు చేయలేకున్నా, పూర్తి స్థాయి వైరింగ్?, ప్లంబింగ్ పనులు పూర్తి చేయకపోయినా ఆఖరి బిల్లు కోసం లబ్ధిదారుతో ఉన్న ఇంటి చిత్రాల్ని తీసి బిల్లు కోసం సిఫార్సు చేసేందుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు హౌసింగ్? కార్పొరేషన్? ఎండీ వీపీ గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇలా చిన్న చిన్న హంగుల కోసం బిల్లులు నిలిపివేసే పరిస్థితి ఇకపై ఉండదని స్పష్టం చేశారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 42,627 గృహాలు మంజూరు అయ్యాయి. అందులో 16,949 ఇళ్లు కప్పు దశ వరకు పూర్తయ్యాయి. ఇవన్నీ తుది దశలోనే ఉన్నందున వీటికి చివరి బిల్లు మంజూరయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్? ఆదేశానుసారం ఇలాంటి ఇళ్లను గుర్తించి బిల్లులకు సిఫార్సు చేసేందుకు సర్వే చేస్తున్నారని జనగామ జిల్లా పీడీ మాతృనాయక్ వివరించారు.

**జిల్లాల వారీగా ఇళ్ల వివరాలు ఇలా**

| జిల్లా | మంజూరు | కప్పు వేసినవి |
|---|---|---|
| జనగామ | 5,647 | 2,958 |
| ములుగు | 5,191 | 1,560 |
| మహబూబాబాద్? | 10,180 | 4,476 |
| వరంగల్? | 9,374 | 3,637 |
| హనుమకొండ | 8,074 | 3,134 |
| భూపాలపల్లి | 4,161 | 1,184 |

2 నెలల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రకటన : మరోవైపు రాష్ట్రంలో ప్రతి ఏడాది ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తామని, 2026–27 ఆర్థిక సంవత్సరానికి రెండు నెలల్లో రెండో విడత ప్రకటిస్తామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అంతేకాదు గతంలో మంజూరై, సగంలో నిలిచిపోయిన గృహాలను పూర్తి చేసేలా అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు వచ్చే ఏడాది పథకంలో వివరిస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ తొలి దఫా పథకంలో మార్చి నెలాఖరు నాటికి లక్ష గృహాలు, జూన్?, జులై వరకు మొత్తం 3 లక్షల నిర్మాణాలు పూర్తవుతాయని వెల్లడించారు.

**త్వరలో మరో టోల్ ఫ్రీ నంబర్**

బ్యాంకు రుణాలతో కార్లు కొనుగోలు చేసి డ్రైవర్లుగా కొనసాగుతున్న వారిని లబ్ధిదారుల జాబితాలో చేర్చలేదని, అర్హులందరికీ న్యాయం జరిగేలా ఇందిరమ్మ గృహాల పథకం నిబంధనల్లో మార్పులు చేయాలని మండలి ఛైర్మన్? గుత్తా సుఖేందర్?రెడ్డి మంత్రికి సూచించారు. రాష్ట్రంలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని పొంగులేటి తెలిపారు. త్వరలో మరో టోల్? ఫ్రీ నంబర్? అందుబాటులోకి తెస్తామని చెప్పారు. అయితే గత ప్రభుత్వం 2.31 లక్షల డబుల్? బెడ్?రూం ఇళ్లు మంజూరు చేసిందని, వాటిల్లో 1.63 లక్షల ఇళ్లు దాదాపుగా పూర్తయ్యాయని స్పష్టం చేశారు. పూర్తిగా సిద్ధమైన వాటిని లబ్ధిదారులకు కేటాయించామని చెప్పారు. మిగిలిన పనులు పూర్తి చేసి ఈ 99 రోజుల కార్యక్రమంలో వాటిని లబ్ధిదారులకు ఇవ్వాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

# గులాబీకి భారం అవుతున్న కౌశిక్...

**కరీంనగర్** : కౌశిక్ రెడ్డి రాజకీయ ప్రవర్తన మొదటి నుంచి వివాదాస్పదంగానే ఉంటోంది. ఓ సారి అరికెపూడి గాంధీ ఇంటి మీదకు వెళ్లారు. ఇప్పుడు కడియంపై అదే తరహా అగౌరవం ప్రవర్తనకు పాల్పడ్డారు. నిజానికి ఈ ఇద్దరు నేతలకు.. కౌశిక్ రెడ్డికి సంబంధంలేదు. కనీసం ఆయన జిల్లా వారు కూడా కాదు. కానీ కేటీఆర్ మెప్పు పొందేందుకు కౌశిక్ రెడ్డి ఇలా చేస్తున్నారు. కేటీఆర్ కూడా కౌశిక్ రెడ్డిని ప్రోత్సహిస్తున్నారు. ఆయన రెచ్చిపోతున్నారు.రాజకీయాల్లో సిద్ధాంతపరమైన విభేదాలు, విమర్శలు సహజం. కానీ, కౌశిక్ రెడ్డి అనుసరిస్తున్న తీరు ఇందుకు భిన్నంగా ఉంది. తన జిల్లాకు సంబంధం లేని నేతలైన కడియం శ్రీహరి లేదా అరికెపూడి గాంధీ వంటి వారిని లక్ష్యంగా చేసుకుని, వారి వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగేలా ప్రవర్తించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఒక ప్రజాప్రతినిధిగా సభలో వాడకూడని భాషను వాడటం, సీనియారిటీకి కనీస మర్యాద ఇవ్వకపోవడం వల్ల ఆయన ఇమేజ్ పక్కన పెడితే, సభా గౌరవం దెబ్బతింటోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నట్లుగా, ఈ సంస్కృతిని ఇప్పుడే అదుపు చేయకపోతే భవిష్యత్తులో అసెంబ్లీ కుస్తీ పోటీలకు, భౌతిక దాడులకు వేదికగా మారే ప్రమాదం ఉందన్న ఆందోళనలో వాస్తవం లేకపోలేదు.కౌశిక్ రెడ్డి ఈ తరహా దూకుడు ప్రదర్శించడం వెనుక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మెప్పు పొందాలనే తాపత్రయం ఉంది. పార్టీలో తన ఉనికిని చాటుకోవడానికి, అధినాయకత్వం దృష్టిలో ఫైర్ బ్రాండ్ అనిపించుకోవడానికి ఆయన ఉద్దేశపూర్వకంగానే వివాదాలను కొనితెచ్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. అయితే, ఇలాంటి ప్రవర్తనను కేటీఆర్ గట్టిగా వారించాల్సింది పోయి, సమర్థించడం , ప్రోత్సహించడం వల్ల కౌశిక్ రెడ్డికి తన తప్పు తెలియడం లేదు. రాజకీయాల్లో దూకుడు అవసరమే కానీ, అది ప్రత్యర్థులపై పైచేయి సాధించడానికి ఉండాలి తప్ప, అసహ్యం కలిగించేలా ఉండకూడదు.ఏ పార్టీకైనా ఇలాంటి వివాదాస్పద నేతలు కొంతకాలం మైలేజీని ఇవ్వవచ్చు కానీ,



దీర్ఘకాలంలో అది పార్టీ నైతికతను దెబ్బతీస్తుంది. నిశ్శబ్దంగా ఉండే తటస్థ ఓటర్లు, విద్యావంతులు ఇలాంటి భాషను, ప్రవర్తనను అసహ్యించుకుంటారు. కౌశిక్ రెడ్డి తీరు వల్ల బీఆర్ఎస్ ఒక క్రమశిక్షణ లేని పార్టీగా ప్రజల్లో ముద్ర పడే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీని మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సమయంలో, ఇలాంటి వివాదాలు అసలు చర్చను పక్కదారి పట్టించి పార్టీకి కోలుకోలేని నష్టాన్ని చేకూర్చే ప్రమాదం ఉంది.రాజకీయ నాయకుడికి ఉండాల్సిన ప్రాథమిక లక్షణం సమయం–సందర్భం తెలియడం. కౌశిక్ రెడ్డి విషయంలో ఆ పరిణతి లోపించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తన దూకుడును పార్టీ ప్రయోజనాల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం వాడుకుంటే అది ఆయన రాజకీయ భవిష్యత్తుకు ప్లస్ అవుతుంది. కానీ, ఇలాగే వ్యక్తిగత దాడులకు దిగుతూ, సభా మర్యాదలను కాలరాస్తే.. అది ఆయన పతనానికే కాకుండా పార్టీ ప్రతిష్టకు కూడా గొడ్డలి పెట్టుగా మారుతుంది. ఈ విషయాన్ని గుర్తంచాల్సింది వారే.

## వేసవిలో వర్షాలు

-మొదటిపేజీ తరువాయి

రాత్రి కురిసిన అకాల వర్షానికి అన్నదాతలు కుదేలయ్యారు. నిజామాబాద్ జిల్లాలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేసింది. కల్లాల్లో ఆరబోసిన పసుపు, ఎర్ర జొన్న, జొన్న, మొక్కజొన్న తడిసి ముద్దయ్యాయి. ధర్పల్లి, సిరికొండ మండలాలలో కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఈదురుగాలులకు మొక్కజొన్న, వరి పంటలు నేలకొరిగాయి. చేతికొచ్చిన మామిడికాయ పంట నేలపాలయ్యింది.

ఇక, ఆంధ్రప్రదేశ్‌లో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో వానలు పడతాయని తెలిపారు. శ్రీకాకుళం, అల్లూరి, పోలవరం, కర్నూలు, నంద్యాలలో వర్షాలు కురుస్తాయని అన్నారు. తెలంగాణలోని జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడి వర్షం కురిసింది. గత అర్ధరాత్రి కూడా ఈదురు గాలులతో కూడిన వర్షానికి మామిడి, చింత, వరి పంటలు నేలరాలాయి. అకాల వర్షానికి రైతులు పంటలు నష్టపోయారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇవాళ ఉదయం పలుచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడ్డాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు బిక్కనూరు, దోమకొండ, మాచారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మంగళవారం (మార్చి 31) ఉదయం తెల్లవారుజామున గంటపాటు భారీ వర్షం పడింది. అకాల వర్షంతో పంటలు దెబ్బతిన్నాయి. పలు మండలాల్లో అకాల వర్షానికి మొక్కజొన్న పంట నేలకొరిగింది. అలాగే, పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు గ్రామాలు అంధకారంలో ఉన్నాయి.

మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలో నిన్న రాత్రి వీచిన ఈదురు గాలులకు మామిడి పంటకు తీవ్ర నష్టం జరిగింది. కాయ నేల రాలడంతో ఆర్థికంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస??తున్నారు రైతులు. ప్రభుత్వం వెంటనే స్పందించి మామిడి రైతులకు నష్ట పరిహారమందించాలని కోరుతున్నారు.

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలో అకాల వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఈదురు గాలులతో కూడిన వర్షం వరి మాత్రమే కాకుండా మొక్కజొన్న పంటలను కూడా దెబ్బతీసింది. ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్, దొంకేశ్వర్ మాక్లూర్ ఆలూరు మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలు పొలాల్లోనే నేలరాలిపోగా, కలాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసి నష్టపోయింది.

## కమలంలో కాసుల లొల్లి

-మొదటిపేజీ తరువాయి

అంతేకాకుండా పార్టీకి ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలు సైతం ఉన్నారు. పట్టణాల ప్రాంతాల్లో బీజేపీకి పట్టు ఉన్నదని సర్వేల ద్వారా గుర్తించగా.. మున్సిపల్ ఎన్నికలపై ఆ పార్టీ భారీ ఆశలు పెట్టుకున్నది. గతంలో కంటే స్థానాలు పెరుగుతాయని, కొన్ని మేయర్, చైర్మన్లయినా కైవసం చేసుకుంటామని భావించింది. మహారాష్ట్ర మంత్రి ఆశీష్ షెలార్ కు కీలక బాధ్యతలు అప్పగించింది. అనంతరం ఎన్నికల కోసం భారీగా నిధులు సమకూర్చినట్లు తెలిసింది. అయితే ఫలితాలను చూసి నాయకులు తీవ్ర నిరాశకు గురైనట్లు సమాచారం. దీంతో మున్సిపాలిటీలు, జిల్లాల వారీగా ఫలితాలపై పార్టీ సమీక్షించింది. కనీస స్థాయిలో కౌన్సిలర్లు, కార్పొరేటర్ స్థానాల్లో విజయం సాధించకపోవడం, చైర్మన్, మేయర్ స్థానాలను సైతం కైవసం చేసుకోవడంలో విఫలం కావడం పట్ల రాష్ట్ర నాయకత్వంపై అధిష్ఠానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా పార్టీ నాయకుల ద్వారా తెలిసింది.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్డులు, డివిజన్లను బీజేపీ ఏ, బీ, సీ, డీ గా విభజించింది. విజయావకాశాలు ఏ మాత్రం లేని వాటిని డీ కేటగిరిలో చేర్చింది. ఆ తర్వాత ఏ, బీ, సీ కేటగిరీల వార్డులకు కొంత మొత్తాన్ని నిర్ణయించి పార్టీ జిల్లా అధ్యక్షులకు నిధులు పంపించినట్లు నేతల ద్వారా తెలిసింది. అయితే ఆ నిధుల్లో వారు అత్యధిక శాతం నొక్కేసినట్లు చర్చ జరుగుతున్నది. అంతేకాకుండా ఏ కేటగిరి డివిజన్లకు బీ, సీ కేటగిరిలకు నిర్ణయించిన మొత్తాన్ని అభ్యర్థులకు ఇచ్చినట్లు పార్టీ నాయకత్వం గుర్తించినట్లు తెలిసింది. ఇలా పది మంది జిల్లా అధ్యక్షులు పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేసినట్లు అంచనాకు వచ్చిన రాష్ట్ర నాయకత్వం.. వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.ఉత్తర తెలంగాణలోని ఒక జిల్లాకు చెందిన మహిళా నాయకురాలిపై అక్కడి బీజేపీ నాయకులు రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లుగా పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. పార్టీ పంపించిన నిధులను అభ్యర్థులకు ఇవ్వకుండా స్వాహా చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే ఆమెకు అక్కడి ముఖ్య ప్రజాప్రతినిధి మద్దతు ఉన్నట్లు తెలిసింది. ఉత్తర తెలంగాణలో ఉద్యమాల జిల్లాగా గుర్తింపు ఉన్న మరో జిల్లాలో రెండంకెల ఓట్లు రాని వార్డులను సైతం ఏ గ్రేడ్ గా చూపించి నిధులను మెక్కేసినట్లు పార్టీ గుర్తించింది. అక్కడ పార్టీకి అంత పట్టులేదని ఆ తర్వాత జరిగిన సమీక్షలో పార్టీ ముఖ్యనేత చెప్పినట్లు సమాచారం. దీంతో సంబంధిత బాధ్యుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కీలక నేతలు.. మొత్తం డబ్బులు కక్కాల్సిందేనని చెప్పినట్లు తెలిసింది. దీంతోపాటు మరికొన్ని జిల్లాల్లోనూ ఇదే తరహాలో నిధులు స్వాహా చేశారని పార్టీ నాయకత్వం గుర్తించినట్లు సమాచారం.గతంలో బీజేపీలో ఉన్న క్రమశిక్షణ, నిబద్ధత ఇప్పుడు కరువయ్యాయని పాత కేడర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నది. అయితే డబ్బులు ఇచ్చి పదవులు తెచ్చుకున్నామని అంతర్గతంగా తమ అనుచరులకు చెబుతున్న నేతలు.. వచ్చే ఎన్నికల వరకు తమకు ఖర్చులకు డబ్బులు కావాలి కదా అనే రీతిలో మాట్లాడుతున్నట్లు చర్చ జరుగుతున్నది. అయితే నిధుల స్వాహాలో ముఖ్యంగా పది జిల్లాల బాధ్యులను గుర్తించగా.. వారిని తొలగించడం ఎంత వరకు సాధ్యమనే కోణంలో రాష్ట్ర నాయకత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. దాని కంటే ముందు వారికి నోటీసులు ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఇలాగే నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించగా.. మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇది రిపీట్ కావడంతో.. గట్టి చర్యలు తీసుకుంటేనే ఇలాంటివి పునరావృతం కావని అధిష్ఠానం ఒక నిర్ణయానికి వచ్చినట్లు చర్చ జరుగుతున్నది.

## పొంగులేటీ టార్గెట్ వెనుక... ఏం జరుగుతోంది

**హైదరాబాద్** : తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ప్రస్తుతం బిఆర్ఎస్ వర్సెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య జరుగుతున్న యుద్ధం అత్యంత ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంటే ఎక్కువగా పొంగులేటిని టార్గెట్ చేయడం వెనుక బలమైన రాజకీయ కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఒక కీలక విషయాన్ని లేవనెత్తారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొన్ని అక్రమ వ్యవహారాలు, కొత్త ప్రాజెక్టుల విషయంలో బిఆర్ఎస్ నేతలు చేస్తున్న పైరవీలకు పొంగులేటి అడ్డుపడుతున్నారని, అందుకే ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు.గతంలో తమకు అనుకూలంగా ఉన్న వ్యవస్థలను పొంగులేటి ఇప్పుడు ప్రక్షాళన చేస్తుండటంతో, తమ పనులు కావడం లేదన్న కోపంతోనే బిఆర్ఎస్ పెద్దలు పొంగులేటి అక్రమ మైనింగ్ పై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నారని అధికార పక్షం వాదన. పొంగులేటిని ఒత్తిడిలోకి నెట్టడం ద్వారా తమ పాత పనులను చక్కబెట్టుకోవాలనే వ్యూహం ఇందులో ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, బిఆర్ఎస్ నేతలు మాత్రం పొంగులేటిపై అక్రమ మైనింగ్ అనే అస్త్రాన్ని బలంగా ప్రయోగిస్తున్నారు. కేవలం అసెంబ్లీకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం, గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా దీనిని ఒక పెద్ద స్కామ్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు.పొంగులేటి వ్యాపార సామ్రాజ్యాన్ని దెబ్బతీయడం ద్వారా ఆయన రాజకీయ ప్రభావాన్ని తగ్గించవచ్చని బిఆర్ఎస్ భావిస్తున్నట్లుగా చెబుతున్నారు. గతంలో తమ పార్టీలో ఉన్న వ్యక్తి కావడంతో, ఆయన బలహీనతలు తమకు తెలుసని, అందుకే పకడ్బందీగా ఆధారాలతో దాడి చేస్తున్నామని బిఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. అయితే, ఇది నిజంగా అవినీతిపై పోరాటమా లేక రాజకీయ కక్షసాధింపా అన్నది ప్రజల్లో చర్చనీయాంశమైంది.రాజకీయంగా చూస్తే, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ తీశారు. గత ఎన్నికల్లో అక్కడ బిఆర్ఎస్ క్లీన్ స్వీప్ అవ్వడానికి ఆయనే ప్రధాన కారకుడు. భవిష్యత్తులో కూడా ఆయన తన పట్టును పెంచుకుంటే బిఆర్ఎస్ ఆ జిల్లాలో కోలుకోవడం అసాధ్యం. అందుకే, ఆయనపై అవినీతి ముద్ర వేయడం ద్వారా ప్రజల్లో ఆయన ఇమేజ్‌ను దెబ్బతీయాలనేది బిఆర్ఎస్ వ్యూహంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి కంటే పొంగులేటిని టార్గెట్ చేయడం వల్ల అటు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టవచ్చు, ఇటు తమ బద్ధశత్రువుపై పగ తీర్చుకోవచ్చు అనే వ్యూహం అమలు చేస్తున్నారని భావిస్తున్నారు.

# సంపాదకీయం

## ఆర్‌బిఐ అప్రతిహత జైత్రయాత్ర

భారతదేశ ఆర్థిక చరిత్రను నిశితంగా పరిశీలిస్తే, ఒక దేశం యొక్క సార్వభౌమాధికారం కేవలం దాని రాజకీయ సరిహద్దుల్లోనే కాకుండా, ఆ దేశ కరెన్సీ స్థిరత్వం మరియు ఆర్థిక క్రమశిక్షణలోనూ దాగి ఉంటుందని స్పష్టమవుతుంది. ఈ దిశగా భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా, దిక్సూచిగా నిలిచిన అత్యున్నత సంస్థ 'భారతీయ రిజర్వు బ్యాంకు' (ఆర్బీఐ). ఒక చారిత్రక అనివార్యతగా ప్రారంభమై, నేడు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన కేంద్రీయ బ్యాంకులలో ఒకటిగా ఎదిగిన ఆర్బీఐ ప్రస్థానం అనన్య సామాన్యం. మొదటి ప్రపంచ యుద్ధం (1914– 1918) సృష్టించిన ఆర్థిక విధ్వంసం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల ఆర్థిక పునాదులను కదిలించి వేసింది. యుద్ధం కారణంగా ఏర్పడిన సరఫరా గొలుసు అంతరాయాలు, విపరీతమైన రక్షణ వ్యయం, మరియు కరెన్సీ విలువలలో సంభవించిన అస్థిరత అప్పట్లో బ్రిటిష్ వలస పాలనలో ఉన్న భారతదేశంపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. యుద్ధ కాలంలో బ్రిటన్ తన అవసరాల కోసం విపరీతంగా కరెన్సీని ముద్రించడంతో ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకింది. 1920వ దశకంలో భారతీయ రూపాయి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో, ముఖ్యంగా పౌండ్ స్టెర్లింగ్‌తో పోల్చినప్పుడు తీవ్రమైన ఒడిదుడుకులకు లోనైంది. రూపాయి విలువ ఒక పౌండ్ స్టెర్లింగ్‌కు 15 రూపాయల వరకు పెరగడం, మళ్ళీ అతి తక్కువ కాలంలోనే 13 రూపాయలకు పడిపోవడం వంటి పరిణామాలు భారతీయ వ్యాపారవేత్తలను, సామాన్య రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బ తీశాయి. కరెన్సీ మరియు పరపతి నియంత్రణను కేవలం ప్రభుత్వ విభాగంగా కాకుండా ఒక స్వతంత్ర కేంద్రీయ సంస్థ ద్వారా నిర్వహించాల్సిన అవసరం ఆ కాలంలోనే బలంగా వినిపించింది. ఈ నేపథ్యంలో, భారత కరెన్సీ మరియు ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు సూచించేందుకు 1926లో బ్రిటిష్ ప్రభుత్వం 'రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్'ను నియమించింది. దీనినే మనం 'హిల్టన్ యంగ్ కమిషన్' అని పిలుస్తాము. అయితే, ఈ బ్యాంకు ఏర్పాటు వెనుక ఉన్న మేధోపరమైన పునాదిని ప్రస్తావించకుండా ఆర్బీఐ చరిత్ర అసంపూర్ణ మవుతుంది. ఆధునిక భారతదేశ నిర్మాతలలో ఒకరైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాసిన "ది ప్రాబ్లం ఆఫ్ ది రూపాయి – ఇట్స్ ఆరిజిన్ అండ్ ఇట్స్ సొల్యూషన్" అనే పరిశోధనా గ్రంథం ఈ కమిషన్ ముందు ఒక దిక్సూచిలా నిలిచింది. అంబేద్కర్ గారు కరెన్సీ స్థిరత్వంపై అందించిన లోతైన విశ్లేషణలు, ఒక కేంద్రీయ బ్యాంకుకు ఉండాల్సిన స్వయం ప్రతిపత్తిపై ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు హిల్టన్ యంగ్ కమిషన్ సభ్యులను ఎంతగానో ప్రభావితం చేశాయి. ఫలితంగా, భారతదేశానికి ఒక స్వతంత్ర కేంద్రీయ బ్యాంకు ఉండాలనే బలమైన సిఫారసు వెలువడింది. ఈ సిఫారసుల ఆధారంగానే 'భారతీయ రిజర్వు బ్యాంకు చట్టం, 1934' ఆమోదించ బడింది. ఆ చట్టం ప్రకారం 1935 ఏప్రిల్ 1న ఆర్బీఐ తన కార్యకలాపాలను అధికారికంగా ప్రారంభించింది. ఆరంభంలో ఇది ఒక ప్రైవేట్ షేర్ హోల్డర్ల సంస్థగా, 5 కోట్ల రూపాయల ప్రాథమిక మూలధనంతో ఏర్పాటైంది. ఆ రోజుల్లో ఇది ఒక అసాధారణ పెట్టుబడిగా పరిగణించ బడేది. మొదట కోల్‌కతాలో ఉన్న దీని ప్రధాన కార్యాలయాన్ని, దేశ వాణిజ్య కార్యకలాపాల కేంద్ర బిందువుగా ఎదుగుతున్న ముంబైకి 1937లో మార్చడం జరిగింది. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత, దేశాభివృద్ధిలో కేంద్రీయ బ్యాంకు పాత్ర మరింత కీలకమని ప్రభుత్వం గుర్తించింది. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్న ఆర్థిక అధికారం ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగపడాలనే ఉద్దేశంతో 1949 జనవరి 1న ఆర్బీఐని జాతీయీకరించారు. దీంతో ఇది పూర్తిగా భారత ప్రభుత్వ పర్యవేక్షణలోకి రావడమే కాకుండా, దేశ సామాజిక–ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసే ఒక ప్రజాస్వామ్య సంస్థగా రూపాంతరం చెందింది. ఆర్బీఐ యొక్క ప్రాథమిక మరియు అత్యంత ముఖ్యమైన విధి 'కరెన్సీ జారీ'. ఒక రూపాయి నోటు మరియు చిల్లర నాణేలు మినహా, భారతదేశంలో చలామణిలో ఉన్న ప్రతి కరెన్సీ నోటు వెనుక ఆర్బీఐ గవర్నర్ సంతకం చేసిన 'భరోసా' ఉంటుంది. 1950వ దశకంలో కేవలం 1,200 కోట్లుగా ఉన్న కరెన్సీ చలామణి, నేడు 35 లక్షల కోట్లకు పైగా పెరగడం అనేది కేవలం అంకెల్లో పెరుగుదల మాత్రమే కాదు, అది భారత ఆర్థిక వ్యవస్థ విస్తరణకు, పారిశ్రామిక వృద్ధికి మరియు ప్రజల కొనుగోలు శక్తికి అద్దం పడుతోంది. అయితే, కేవలం డబ్బును ముద్రించడం మాత్రమే కాకుండా, మార్కెట్‌లో డబ్బు సరఫరాను నియంత్రించడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం ఆర్బీఐ యొక్క అసలైన నైపుణ్యం. దీనినే మనం 'ద్రవ్య విధానం' అంటాము. రిపో రేటు (బ్యాంకులకు ఆర్బీఐ ఇచ్చే అప్పుపై వడ్డీ), రివర్స్ రిపో రేటు, నగదు నిల్వల నిష్పత్తి వంటి సంక్లిష్టమైన సాధనాల ద్వారా మార్కెట్‌లో నగదు లభ్యతను ఆర్బీఐ సర్దుబాటు చేస్తుంది. ఉదాహరణకు, కరోనా మహమ్మారి సమయంలో ఆర్థిక వ్యవస్థ స్తంభించకుండా ఉండేందుకు రిపో రేటును 4 శాతానికి తగ్గించి, మార్కెట్లోకి నిధులు ప్రవహించేలా చేయడం ద్వారా సామాన్యులకు తక్కువ వడ్డీకే రుణాలు అందేలా చేసిన ఘనత ఆర్బీఐదే. కేంద్రీయ బ్యాంకుగా ఆర్బీఐ పోషిస్తున్న మరో కీలక పాత్ర 'బ్యాంకర్లకు బ్యాంకర్'గా వ్యవహరించడం. దేశంలోని వాణిజ్య బ్యాంకులన్నీ తమ నిధులలో కొంత భాగాన్ని భద్రత కోసం ఆర్బీఐ వద్ద ఉంచాలి. ఇది బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని కలిగిస్తుంది. అలాగే, ప్రభుత్వానికి కూడా ఇది ఆర్థిక సలహాదారుగా పనిచేస్తుంది. ప్రభుత్వం తరపున బాండ్లు జారీ చేయడం, రుణాలు సేకరించడం వంటి బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తోంది. భారత ఆర్థిక చరిత్రలో 1991వ సంవత్సరం ఒక పెద్ద మలుపు. అప్పట్లో దేశం తీవ్రమైన విదేశీ మారక ద్రవ్య సంక్షోభాన్ని ఎదుర్కొంది. మన వద్ద ఉన్న నిల్వలు కేవలం రెండు వారాల దిగుమతులకు సరిపడేలా, అంటే కేవలం 1 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అటువంటి క్లిష్ట సమయంలో ఆర్బీఐ మరియు ప్రభుత్వం కలిసి చేపట్టిన సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలు మనల్ని గట్టెక్కించాయి. ఆ సంక్షోభం నుండి పాఠాలు నేర్చుకున్న ఫలితంగా, నేడు మన విదేశీ మారక నిల్వలు 650 బిలియన్ డాలర్ల మైలురాయిని అధిగమించాయి. ఇది ప్రపంచ వేదికపై భారత ఆర్థిక పటిమను చాటి చెబుతోంది. మారుతున్న కాలంతో పాటు ఆర్బీఐ తనను తాను ఆధునీకరించుకుంటూ వస్తోంది. నేడు మనం ఉపయోగిస్తున్న యూపీఐ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక పారదర్శకతను పెంచడంలో ఆర్బీఐ కీలక పాత్ర పోషించింది. 2024–25 నాటికి నెలకు సగటున 12 బిలియన్లకు పైగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయంటే, అది ఆర్బీఐ కల్పించిన డిజిటల్ మౌలిక సదుపాయాల విజయం. అంతేకాకుండా, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 'సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ' లేదా డిజిటల్ రూపాయిని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. ఇది కరెన్సీ నిర్వహణ వ్యయాన్ని తగ్గించడమే కాకుండా, లావాదేవీల వేగాన్ని పెంచుతుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మరియు ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ఆర్బీఐ తన సమతుల్య విధానాలతో దేశాన్ని సురక్షిత తీరాలకు చేరుస్తోంది. 2022–2024 మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు, ఆర్బీఐ అప్రమత్తంగా వ్యవహరించి వడ్డీ రేట్లను సవరించడం ద్వారా దేశీయ మార్కెట్‌లో ధరల స్థిరత్వాన్ని కాపాడింది. ముగింపుగా చెప్పాలంటే, భారతీయ రిజర్వు బ్యాంకు అనేది కేవలం ఒక నియంత్రణ సంస్థ మాత్రమే కాదు, అది దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక సురక్షితమైన కవచం. హిల్టన్ యంగ్ కమిషన్ సిఫార్సుల నుండి డాక్టర్ అంబేద్కర్ మేధో పునాది వరకు, 1935 నాటి ప్రైవేట్ సంస్థ నుండి నేటి డిజిటల్ ఆర్థిక చోదక శక్తి వరకు ఆర్బీఐ ప్రయాణం స్ఫూర్తిదాయకం. దేశంలోని పేద ప్రజల పొదుపు మొత్తానికి భద్రతనిస్తూ, పారిశ్రామిక వేత్తల పెట్టుబడులకు దిశానిర్దేశం చేస్తూ, అంతర్జాతీయ స్థాయిలో రూపాయి గౌరవాన్ని నిలబెడుతూ ఆర్బీఐ చేస్తున్న కృషి అమోఘం. రాబోయే దశాబ్దాల్లో భారతదేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే క్రమంలో, ఆర్బీఐ తన అనుభవం మరియు ఆధునిక సాంకేతికతతో దేశాభివృద్ధికి మరింత పటిష్టమైన పునాది వేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

# వారికి మానవ హక్కులు లేవా?

ఆటిజం అనేది జీవితాంతం ఉండే ఒక నాడీ సంబంధిత రుగ్మత. పిల్లల్లో మొదటి మూడేళ్ల లోపు ఆటిజం సంభవిస్తుంది. ఈ సమస్యతో బాధపడుతున్న పిల్లలు ఎదుర్కొనే సమస్యలను అర్థం చేసుకోవడం చాలా క్లిష్టమైన అంశం. సామాజిక భద్రతతో పాటు పిల్లలకు భద్రత, గౌరవం, సమాన అవకాశాలను కల్పించడం తల్లిదండ్రులకు చాలా కష్టంతో కూడుకున్న విషయం. ఆటిజంను 'ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్' అని పిలుస్తారు. మొదటగా పిల్లలు సాధారణంగానే కనిపిస్తున్నప్పటికీ క్రమేణా సామాజిక, భాషా నైపుణ్యాలను కోల్పోవడం వలన ఈ వ్యాధి లక్షణాలు తీవ్రంగా మారతాయి. 18 నెలల వయస్సు ఉన్నప్పుడు పిల్లల్లో కనిపిస్తున్న లోపాలను గుర్తించడం జరుగుతుంది. ఆటిజం వేగంగా విస్తరిస్తుంది. ఆటిజం కలిగిన పిల్లల సామర్థ్యాలు, అవసరాలు మారుతూ కాలక్రమేణా పెరుగుతాయి. ఈ రుగ్మత కలిగిన వారిలో కొద్దిమంది స్వతంత్రంగా జీవించగలు గుతున్నప్పటికీ మరి కొంతమంది తీవ్రమైన వైకల్యానికి గురవుతారు. ఆటిజం చదువుతోపాటు ఉపాధి అవకాశాలపై ప్రభావం చూపుతుంది. పర్యావరణంలో వస్తున్న మార్పులు ఆటిజం కలిగిన చిన్నారులపై తీవ్ర ప్రభావం చూపుతున్నా యని అనేక అధ్యయన నివేదికలు వెల్లడిస్తున్నాయి. తల్లిదండ్రులు తక్కువ వయస్సు కలిగి ఉండడం, గర్భధారణ సమయంలో వాయు కాలుష్యానికి గురికావడం, నెలలు నిండక ముందే పిల్లలు పుట్టడం, తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం వంటివి ఆటిజం పెరుగుదలకు కారణమవుతున్నా యి. ప్రపంచ జనాభాలో 1 శాతం మందికి ఆటిజం రుగ్మత ఉంది. 2023లో యునైటెడ్ స్టేట్స్ లోని ప్రతి 36 మంది పిల్లల్లో 1 శాతం మంది ఆటిజంతో బాధపడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 2000 సంవత్సరం నుండి 2023 నాటికి 178 శాతానికి పెరిగింది. గత పదేళ్ల కాలంలో 7,07,000 నుండి 1,11,6000 మందికి పాఠశాలల్లో ఆటిజం రుగ్మతకు అవసరమైన సేవలు లభించడం లేదు. ఆటిజం కలిగిన పెద్దల్లో 75 శాతం మందికి ఉపాధి లభించడం లేదు. 25 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుల్లో 50 శాతం మంది ఉద్యోగం చేయలేకపోతున్నారు. ఆటిజం కలిగిన వారిలో 40 శాతం మంది శబ్దం వినలేక పోతున్నారు. 78 శాతం మంది పిల్లలు మరొక మానసిక ఆరోగ్య రుగ్మత కలిగి ఉంటున్నారు. 80 శాతం మంది ఆటిజం కలిగిన పిల్లలు నడవలేకపోతు న్నారు. రాయలేకపోతున్నారు. మన దేశంలో ప్రస్తుతం 1 కోటి 80 లక్షల మంది ఆటిజంతో బాధపడుతున్నారని అంచనా. దేశంలో ప్రతి 66 మంది పిల్లలలో ఒకరికి ఆటిజం సమస్య ఉంది. ఆటిజం సమస్య కలిగిన పిల్లల్లో 40 శాతం మంది పిల్లలు మాట్లాడలేకపోతున్నారు. ఆటిజం అమ్మాయిల కంటే అబ్బాయిల్లో 4 రెట్లు ఎక్కువగా నిర్ధారణ అవుతున్నదని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఆటిజం ఉన్న పెద్దల్లో 40 శాతం మంది జీతం పొందే ఉద్యోగాలు చేయలేకపోతున్నారు. ఈ సమస్య వున్న వారిలో మూడింట ఒక వంతు మందికి ఆందోళన ఉంటుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ఆటిజంను కూడా అంగవైకల్యంగా గుర్తించింది. కానీ నేటికీ వారికి వైకల్య ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదు. ఆటిజం, సెరిబ్రల్ పాల్సి, మానసిక వికలాంగుల సంక్షేమం కోసం నేషనల్ ట్రస్ట్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. ఈ రుగ్మత కలిగిన వారికి ప్రత్యేక పాఠశాలలు, సౌకర్యాలు కల్పించాలి. ఆటిజం సమస్య కలిగిన పిల్లలకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలి. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలి. పుట్టిన పిల్లల్లో శారీరక, మానసిక వైకల్యాల లోపాలను గుర్తించి వాటిని నివారించడానికి ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉంది. ఆటిజం ఉన్న వారితో సహా ప్రజలందరికీ అత్యున్నత స్థాయి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందే హక్కు ఉంది. అయినప్పటికీ, ఆటిజం ఉన్న వారు తరచుగా వివక్షకు గురవుతారు. మరీ ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, విద్యకు సంబంధించి సమాన అవకాశాలను అన్యాయంగా నిరాకరించడం జరుగుతున్నది. ఆటిజం ఉన్నవారికి సాధారణ జనాభాకు ఉండే ఆరోగ్య సమస్యలే ఉంటాయి. అయితే, వీరికి అదనంగా, ఇతర ఆరోగ్య సమస్యలకు సంబంధించిన ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ అవసరాలు ఉండవచ్చు. సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం వంటి ప్రవర్తనాపరమైన కారణాల వల్ల, వారు దీర్ఘకాలిక అంటువ్యాధులు, వ్యాధుల బారిన పడటానికి అవకాశం ఎక్కువ. అలాగే వారు హింసకు గురయ్యే, గాయాలపాలయ్యే ప్రమాదం కూడా ఎక్కువ. ఆటిజం ఉన్నవారు అకాల మరణం చెందే అవకాశం అధికం. సాధారణ జనాభాతో పోలిస్తే ఆటిజం ఉన్నవారిలో ఆరోగ్య సంరక్షణ అవసరాల రేటు ఎక్కువగా ఉంది. మానవతా అత్యవసర పరిస్థితులలో కూడా వారు ఎక్కువగా ప్రభావితమ వుతారు. ఆరోగ్య సంరక్షణ చూసేవారికి ఆటిజం గురించి సరైన అవగాహన లేకపోవడం ఒక సాధారణ అడ్డంకిగా ఏర్పడుతున్నది. ఆటిజంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేసి తల్లిదండ్రులలో, సమాజంలో దీనిపట్ల అవగాహన కల్పించేందుకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

# ఆధునిక శరీర ధర్మశాస్త్ర పితామహుడు విలియం హార్వే

శరీరంలో రక్తప్రసరణ జరిగే పద్ధతి గురించి చాలా కాలం క్రితమే పరిశోధించి, భావి వైద్యులకు అపూర్వ విజ్ఞానాన్ని అందించిన గొప్ప శాస్త్రవేత్త విలియం హార్వే. మనిషి గుండెకు సంబంధించిన పూర్తి వివరాలను మిగతా జంతువుల గుండెలతో పోల్చి చూసి శాస్త్ర బద్ధంగా అందజేసిన ఘనత విల్లియం హార్వేకు దక్కుతుంది. శరీరం ద్వారా రక్త ప్రసరణను కనుగొన్న మొదటి పరిశోధకుడు. శరీరంలో రక్త ప్రసరణను సరిగ్గా వివరించి, విలియం హార్వే, ధమనులు మరియు సిరలు పూర్తి సర్క్యూట్ ను ఏర్పరుస్తాయని చూపించాడు. సర్క్యూట్ గుండె వద్ద మొదలై గుండెకు తిరిగి వెళుతుందని అపూర్వ పరిశోధనల ఫలితాలను రుజువు పరిచాడు. మానవ శరీరంపై ఆసక్తి పెంచుకున్న హార్వే అనేక జంతువుల శరీర అంతర్భాగాలను క్షుణ్ణంగా పరిశీలించి గుండెకు, రక్త ప్రసరణ వ్యవస్థ కు సంబంధించి లోతుగా అధ్యయనం చేసిన క్రమంలో గుండె పనితీరు, రక్త ప్రసరణ విధానాలను గమనించాడు. నాడి కొట్టుకోవడం అంటే గుండె కొట్టు కోవడమే అని రుజువు చేశాడు. మనిషి గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టు కుంటుందో, ఎంత రక్తాన్ని పంప్ చేస్తుందో చెప్పగలిగాడు. తన పరిశీలనలతో రెండు అమూల్యమైన గ్రంథాలను వెలువరించాడు. విలియం హార్వే (ఏప్రిల్ 1, 1578 – జూన్ 3, 1657) ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వైద్యశాస్త్రవేత్త. గుండె పనిచేసే తీరును, శరీరంలో రక్తప్రసరణ జరిగే పద్ధతిని చాలా క్రితమే వివరించి నేటి వైద్యులకు మార్గదర్శకు డయ్యాడు. నేడు హృదయం గురించి అందరికీ తెలుసు. రక్త ప్రసరణ వ్యవస్థ మొత్తం ఎలా నడుస్తుందో చెప్పగలుగు తున్నారు. అదే 16 వ శతాబ్దం వరకు గుండె గురించి దేవునికి తప్ప మానవ మాత్రులకు ఏమీ తెలియదు అని భావించేవారు. విలియం హార్వే ఇంగ్లండులోని ఫోక్‌స్టోన్‌లో 1578 ఏప్రిల్ 1న సంపన్నుడైన పట్టణ మేయరుకు పదిమంది సంతానంలో ఒకడిగా పుట్టాడు. పదిహేనవ యేట కేంబ్రిడ్జిలోని సైన్స్ కాలేజీలో చేరాడు. పట్టభద్రుడయ్యాడు. ఆపై వైద్య విద్య కోసం ఇటలీలోని పాడువా వైద్య విద్యాలయంలో చేరాడు. అక్కడ హారోనిమస్ ఫాబ్రీసియస్ అనే ప్రముఖ వైద్య శాస్త్రజ్ఞుని వద్ద శిష్యరికం చేశాడు. 1602 లో వైద్య శాస్త్రంలో పట్టా పుచ్చు కొనటమే



కాకుండా ప్రత్యేకమైన యోగ్యతా పత్రాన్ని పొంద గలిగాడు. అక్కడి నుంచి లండన్ తిరిగి వచ్చాక ఇంగ్లండ్ రాజు మొదటి ఛార్లెస్ కొలువులో ఆస్థాన వైద్యుడిగా నియమితు డయ్యాడు. అంతటి హోదాలో ఉన్న సంపన్నులు ఎవరైనా విలాసంగా జీవితం గడిపేస్తారేమో కానీ, విలియం హార్వే మాత్రం కొత్త విషయాలు తెలుసు కోడానికి పరిశోధకుడిగా మారాడు. గుండెకు సంబంధించిన సందేహాలు మాత్రం ఆయనను వదలలేదు. గుండె నుండి బయలు దేరిన రక్తం రక్త నాళాలలో అటూ ఇటూ ప్రవహించి చివరికి హరించుకు పోతుందే తప్ప మళ్ళీ గుండెను చేరదు అనే వాదంలో నిజం ఉన్నట్లు హార్వేకు తోచలేదు. పెద్ద పెద్ద సిరలలో కవాటాలు ఎందుకు ఉంటాయనే తపన కూడా ఆయనలో బయలుదేరింది. 1615 లో రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ లో ఆయన లెక్చరర్ గా నియమింప బడ్డాడు. చేపలు, కప్పలు, కోళ్ళ పిండాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ వాటి రక్త ప్రసరణ గురించి ఎంతో క్షుణ్ణంగా అధ్యయనం చేయ సాగాడు. గుండె ముడుచు కోవటం వల్ల రక్తం ధమనుల ద్వారా రక్త నాళాలకు వెళు తుందని తెలుసు కున్నాడు. నాడి కొట్టుకోవడం అంటే గుండె కొట్టు కోవడమే అని రుజువు చేశాడు. గుండెలో నాలుగు గదులు ఉంటాయని, ధమనుల ద్వారా గుండె లోని రక్తం బయటికి పంప్ చేయ బడుతుందని, సిరల ద్వారా కవాటాలు రక్తాన్ని గుండె వైపుకి వెళ్ళనిస్తాయే కాని గుండె లోంచి రక్తాన్ని వెలుపలికి రానివ్వవని తెలుసు కున్నాడు. ఒక అర గంటలో శరీరంలో ఉన్న మొత్తం రక్తం గుండె నుండి వెలువడే రక్తమే ఎక్కువగా ఉంటుందని నాడీ వేగం, గుండె స్పందించే రేటు ఆధారంగా నిర్ధారించుకో గలిగాడు.

చనిపోయిన ఖైదీల శరీరాలను అడుగడుగునా పరిశీలించడం ద్వారా గుండె ఒక పంపులాగా పనిచేస్తుందని, శరీరంలో సిరలు, ధమనుల ద్వారా రక్తం వలయా కారంలో ప్రవహిస్తుందని తెలుసు కున్నాడు. రక్తం ప్రవహించే మార్గంలో వాల్వులు ఎలా పనిచేస్తాయో కనిపెట్టాడు. మనిషి గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకుంటుందో, ఎంత రక్తాన్ని పంప్ చేస్తుందో చెప్ప గలిగాడు. తన పరిశీలనలతో రెండు అమూల్యమైన గ్రంథాలను వెలువరించాడు. 1628 లో, 50 సంవత్సరాల వయస్సులో, హార్వే తన పరిశోధనా ఫలితాలను ప్రచురించాడు – సాధారణంగా దీనిని డి మోటో కార్డిస్ – ది మోషన్ ఆఫ్ ది హార్ట్ అని పిలుస్తారు. ఆంగ్లంలో అనాటమికల్ స్టడీస్ ఆన్ ది మోషన్ ఆఫ్ ది హార్ట్ అండ్ బ్లడ్ ఇన్ యానిమల్స్ అంటారు. ఈ ప్రచురణ వైద్య శాస్త్ర చరిత్రలో అపూర్వమైనది. పరిశోధనల ద్వారా వచ్చిన ఫలితాలను మళ్ళీ పరిశోధనల ద్వారానే రూఢి పరచాలనే శాస్త్రవాది హార్వే. ఈ పుస్తకం ప్రచురించిన మూడు సంవత్సరాల తరువాత హార్వే మొదటి చార్లెస్ మహారాజుకు రాజ వైద్యునిగా నియమించ బడ్డాడు. కానీ రాజకీయ విపరిణామాల కారణంగా హార్వే లండన్ విడిచి పెట్టవలసి వచ్చింది. అప్పుడే కొంతమంది దుండగులు హార్వే ఇంటిలో లేని సమయం చూచి ఆయన నాలుగు దశాబ్దాలుగా సేకరించిన దాచుకున్న అమూల్యమైన విజ్ఞాన సంపద నంతా నాశనం చేశారు. అయినా హార్వే బాధ పడలేదు. నిరాశతో క్రుంగిపోలేదు. ప్రత్యుత్పత్తి, పిండాభివృద్ధి అంశాల మీద జీవితమంతా పరిశోధించాడు. 1651 లో "ఎక్సర్ సైజస్ ఆన్ ది జనరేషన్ ఆఫ్ ఆనిమల్స్" అనే పుస్తకాన్ని ప్రచురించాడు. ఈ పుస్తకం ప్రతులు అతి త్వరిత గతిలో అమ్ముడైపోయి కొత్త చరిత్రను సృష్టించాయి. హార్వే 1657 సంవత్సరం జూన్ 3 న మరణించాడు.

# వంట గ్యాస్ సిలిండర్ల కొరత తీరేనా?

మారుమూల పల్లెల నుండి మొదలుకొని పేరు మోసిన పట్టణాల్లో సైతం గ్యాస్ సిలిండర్ల వాడకం విరివిరిగా కొనసాగుతుంది. కానీ ఇప్పుడున్న విపత్కర పరిస్థితుల్లో గ్యాస్ సిలిండర్ల వాడకదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. గ్యాస్ వినియోదారుల అవస్థలు అంత పట్టకుండా ఉండే పరిస్థితులు నేడు దాపరించాయి. ప్రస్తుతం ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో యుద్ధాలు జరుగుతుండడమే వంటగ్యాస్ కొరతకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఈ యుద్ధాల వల్ల గ్యాస్ ఉత్పత్తుల్లో, అంతర్జాతీయ సరఫరా ప్రభావితం అవుతుంది. రష్యా , ఉక్రెయిన్, ఇజ్రాయెల్ వంటి దేశాల నుండి ఖఉ, నాచురల్ గ్యాస్, కొద్దిపాటి పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా క్రమంగా తగ్గిపోతుంది. దీనివల్ల విదేశీ మార్కెట్లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సరఫరా తగ్గుముఖం పట్టడం వల్ల గ్యాస్ సిలిండర్ డిమాండ్‌పై తీవ్రమైన ఒత్తిడి పెరుగు తుంది. భారతదేశంలో ఒఖఉ గ్యాస్ దిగుమతి ఆధారిత వనరుగా ఉంది. తద్వారా కొన్ని దేశాల నుండి ఒఖఉ గ్యాస్ సరఫరా నిలిచిపోయే ఆస్కారం ఉంది. దీనివల్ల ఒఖఉ గ్యాస్ కొరత గణనీయంగా పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం సామాన్య కుటుంబాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజానీకం గ్యాస్ సిలిండర్ల సరఫరా పూర్తిస్థాయిలో లేక సతమతమవుతున్నారు. వృద్ధులు, నిరక్షరాస్యులు ఎలా గ్యాస్ బుక్ చేసుకోవడం తెలియని పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. స్థానిక ఒఖఉ డీలర్ల వద్ద నిల్వలు తగ్గడం వల్ల ఫోన్ లేదా ఆన్లైన్ బుకింగ్ ద్వారా గ్యాస్ సిలిండర్లు అందుబాటులోకి రావడం చాలా కష్టంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో కనీసం బుక్ కావడం కూడా ఒక సవాలుగా దాపరించింది. టోల్ ఫ్రీ నెంబర్, ఐవిఆర్ఎస్, యాప్, ఇలా ఎన్నో రకాలుగా ఉన్న ప్రత్యామ్నా యాల ద్వారా కూడా ప్రయత్నం చేసినా బుక్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో కొరత అధికంగా ఉంది అనడంలో ఆశ్చర్యం లేదు. ఇలాంటి దయనీయమైన పరిస్థితుల్లో చాలామంది ప్రజలు మళ్ళీ పూర్వ కాలపు విధానాల ఏర్పాట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. వంట చెరుకు, గోబర్ గ్యాస్, విద్యుత్ వాడకపు సాధనాలను వినియోగిస్తూ వంట చేసుకుంటున్నారు. భవిష్యత్తులో ఒఖఉ మార్కెట్‌పై అనూహ్య ప్రభావాలు సంభవించే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా ఇలానే యుద్ధం కొనసాగితే ధరలు అనియంత్రితంగా పెరిగే అవకాశం ఉంది. గ్రామీణ



ప్రాంతాల్లో డీలర్ల వద్ద స్టాక్ తక్కువ ఉండడం వలన గ్యాస్ సిలిండర్ల ధర విషయంలో చేతివాటం చూపిస్తున్నారు. వాణిజ్య కేంద్రాలైన హోటల్, రెస్టారెంట్లు, హాస్టల్స్ యాజమాన్యాలతో కుమ్మక్కై గ్యాస్ సిలిండర్లను వారికి నచ్చిన ధరలతో సరఫరా చేస్తూ గృహ వినియోగదారులకు మొండి చేయి చూపిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు చాలా చోట్ల జరుగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఇలాంటి విషయాల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాలను పర్యవేక్షిస్తూ స్టాక్ రికార్డులను పరిశీలించాలి. డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాల వద్ద సామాన్య ప్రజలు తమ పనులను వదులుకొని గంటల తరబడి వేచి ఉండి ప్రాధేయపడిన వారికి సరైన సమాధానం చెప్పే నాధుడు కరువయ్యాడు. ప్రభుత్వ అధికారులు వినియోగదారుల పరిస్థితులను వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని కార్యాచరణ చేయాల్సిన అవసరం ఉంది. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు నెంబర్లపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

# గ్రామంలో ఎలాంటి సమస్య లేకుండా అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి

**అభివృద్ధి పనులను ప్రారంభించిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

గ్రామ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని 7 వ వార్డు ముదిరాజ్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు.

అంతకు ముందు గ్రామంలోని 9 వార్డులో కొత్త బోరు మోటారును బిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతుంది అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బస్నమోని శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి గిరి గౌడ్, వార్డు సభ్యులు మారేపల్లి మంజుల శ్రీను, ముదికొండ కవిత రమేష్ , పిల్లి దేవేందర్, ఎస్ శేఖర్, మాసుల బాలరాజు, జంగిలి ఆనంద్, నాయకులు కొయ్యల పుల్లయ్య ,క్యాసరపు మల్లేష్,ఈదులపల్లి శ్రీనివాస్, బాదేపల్లి రామకృష్ణ,సాదమోని శ్రీనివాస్, అన్నెపు వెంకటయ్య, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## వెల్దండ బీఆర్ఎస్ మండల అధ్యక్షులుగా పుట్ట రాంరెడ్డి



**శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా బోల్లంపల్లి గ్రామ పరిధిలోని చల్లపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పుట్టరామ్ రెడ్డి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు పుట్ట రాంరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ విజిత రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తది తరులు పాల్గొన్నారు.

## భార్య కుమారుడునీ హత్య చేసిన కిరాతక భర్త



**ప్రాణాపాయ స్థితిలో కూతురు మద్యం మత్తు కుటుంబ తగాదాలతో హత్య**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని పులిగోని తాండ లో దారుణం జరిగింది. తండాకు చెందిన రాందాస్ నాయక్ ఆమనగల్ కాటన్ మిల్లులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రాందాస్, కవిత, ఇద్దరికి వివాహమై, వారిద్దరికీ నలుగురు సంతానం. ముగ్గురు ఆడపిల్లలు ఒక బాబు, రాందాస్ నాయక్ తాగుడుకు బానిసై పెళ్లి అయినప్పటి నుంచి తరచు భార్యాభర్తలు గొడవ పడుతుండే వారని గ్రామస్తులు అంటున్నారు. ఆ గొడవ కాస్త కుటుంబాహత్యకు దారి తీసింది. రాందాస్ నాయక్ అతి దారుణంగా కన్న పిల్లలను భార్యను కనికరం లేకుండా కత్తితో గొంతు కోసి అతికిరాతకంగా హత్య చేశారు. భార్య కవిత, బాబు హర్షిత్, (6) అక్కడక్కడే మృతి చెందారు. కూతురు ప్రణీత (8) పరిస్థితి విషమంగా ఉండడంతో ఆసుపత్రికి తరలించారు. మరోఇద్దరు అమ్మాయిలు అమ్మమ్మ దగ్గర ఉండడంతో ప్రాణాలతో బయటపడింది. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మార్చి మాసం- మంటల మేఘాలు, మార్పుల మార్గాలు





**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా :**

ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో కీలక మలుపులకు వేదికగా నిలిచిన మార్చి మాసం, మానవాళికి ఒక హెచ్చరికగా నిలిచింది. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో ఇరాన్ -- ఇజ్రాయెల్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు ప్రపంచ శాంతికి సవాల్‌గా మారాయి. ప్రత్యక్ష యుద్ధం రూపుదాల్చకపోయినా, పరోక్ష దాడులు, ప్రతిదాడులు కొనసాగుతుండటం అంతర్జాతీయ సమీకరణాలను సంక్లిష్టం చేస్తున్నాయి.ఈ పరిణామాల నేపథ్యంలో యునైటెడ్ స్టేట్స్ తన వ్యూహాత్మక ప్రయోజనాల దృష్ట్యా ఇజ్రాయిల్‌కు అండగా నిలుస్తూ, ప్రపంచ రాజకీయ సమతుల్యతపై తన ముద్రను మరింతగా మోపుతోంది. ఫలితంగా, యుద్ధం మంటలు ఎప్పుడైనా మరింత విస్తరించే అవకాశాలపై ప్రపంచ దేశాలు అప్రమత్తంగా గమనిస్తున్నాయి.

### ప్రపంచ ఆర్థిక రంగంపై ప్రభావం

మధ్యప్రాచ్య ఉద్రిక్తతల ప్రభావం అంతర్జాతీయ మార్కెట్లపై స్పష్టంగా కనిపించింది. భద్రతా పెట్టుబడుల వైపు మొగ్గు చూపిన పెట్టుబడిదారుల కారణంగా బంగారం ధరలు గణనీయంగా పెరిగాయి. క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ ఒత్తిడిని పెంచింది.

### భారత ముందు చూపు ధోరణి

భారతదేశం ఈ పరిణామాలను సమతుల్య దృష్టితో పరిశీలిస్తూ తటస్థ విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తోంది. మధ్యప్రాచ్య ప్రాంతంతో ఉన్న ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్త వైఖరిని అవలంబిస్తోంది.ఇక బంగారం ధరల పెరుగుదల, ఇంధన వ్యయాల ప్రభావం దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రతిఫలిస్తోంది.

### తెలంగాణలో ప్రతిస్పందన

ప్రపంచ పరిణామాల ప్రభావం తెలంగాణ రాష్ట్రంలోనూ ప్రతిబింబించింది.

బంగారం ధరల పెరుగుదల సామాన్య ప్రజల కొనుగోలు సామర్థ్యాన్ని ప్రభావితం చేయగా, ఇంధన వ్యయాల పెరుగుదల జీవన వ్యయాన్ని పెంచింది. అదే సమయంలో ఆశా వర్కర్ల వంటి వర్గాల ఆందోళనలు, ప్రజా సమస్యలపై నిరసనలు సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించాయి.

### రాజకీయ,సామాజిక పరిణామాల

మార్చి నెలలో దేశీయ, రాష్ట్ర స్థాయిల్లో రాజకీయ చర్చలు ఉధృతమయ్యాయి. స్థానిక స్థాయిలో నాయకత్వ మార్పులు, ప్రజా సమస్యలపై నిరసనలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని తెలియజేశాయి. మహిళా సంఘాలు, సామాజిక సంస్థల చైతన్య కార్యక్రమాలు సమాజంలో అవగాహనను పెంచాయి. మొత్తానికి మార్చి మాసం ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని అందించింది. యుద్ధం మంటలు కేవలం సరిహద్దులకే పరిమితం కావని, అవి ఆర్థిక, సామాజిక రంగాలను సైతం ప్రభావితం చేస్తాయని మరోసారి నిరూపితమైంది. "శాంతి స్థిరత్వానికి పునాది, యుద్ధం అస్థిరత్వానికి ప్రతీక. మార్చి మాసం ఈ నిజాన్ని మరొక్కసారి మానవాళికి గుర్తుచేసింది."

**గంగవరం రామకృష్ణారెడ్డి**
**( సీనియర్ జర్నలిస్టు వనపర్తి )**

## బీజేపీ, బీఆర్ఎస్‌కు గుడ్‌బై? కాంగ్రెస్‌లో చేరికలు

**భైంసా:** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పోట్పెల్లి గ్రామంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ బోర్రోళ్ల చరణ్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ విరి తమ అనుచరులతో కలిసి పార్టీని వీడుతూ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి సిమెంట్ పంపిణి



**కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలం, చీపునుంతల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మలే రవీందర్ రెడ్డి సహకారంతో అసంపూర్తిగా ఉన్న మార్చ యాదమ్మా, చినుకుంట్ల అలివేలు, కొత్ర లక్ష్మయ్య నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడంతో ఇండ్లకు కావాల్సిన సిమెంటను గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ మరియు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మలే రామచద్రారెడ్డి అందజేయడం జరిగింది. సర్పంచ్ లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రతీ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటూ, సహాయ సహకారాలు అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్ వెంకట్రాజీ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ బండి రఘుపతి, వార్డు సభ్యులు వంకూరి శ్రీరామ్, అంజమ్మ, శారదా, ఎస్సి సెల్ అధ్యక్షులు గోస్కె శ్రీశైలం, నాయకులు పెంటయ్య, శ్యామ్లాల్, వెంకటయ్య,యాదగిరి నరేష్ , శివ, ప్రశాంత్, కుమార్, ,యాదయ్య, నర్సింహా, లక్ష్మయ్య రాములు, చెన్నయ్య,తదితరులు పాల్గొన్నారు.

## అపరమేధావి దివ్యమూర్తికి శాలువాతో సన్మానం

**అగ్నిధారన్యూస్ హైదరాబాద్**



ఖమ్మంజిల్లా నేలకొండపల్లి మండలం కొత్త కొత్తూరు గ్రామానికి చెందిన అపరమేదావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తికి హైదరాబాదులోని సోమాజిగూడలో గల ప్రెస్ క్లబ్లో ఆర్టివి రిపోర్టర్లు అయినటువంటి మధుకర్ మరియు శంకర్ల చేతుల మీదుగా శాలువాతో ఘనంగా సన్మానం జరిగింది. దివ్యమూర్తి ప్రతిభను చూసి ఈ సన్మానం చేస్తున్నట్లు ఆర్ టి వి రిపోర్టర్లు తెలియజేశారు. దివ్యమూర్తి లాంటి ప్రతిభావంతులు ఈ సమాజానికి ఎంతైనా అవసరమని ఆర్ టివి రిపోర్టర్లు తెలియజేశారు. ఈ సన్మానం జరగడం తనకు సంతోషంగా ఉందని, ఇప్పటివరకు 133 వేదికల మీద తనకు సన్మానం జరిగిందని గుగ్గిళ్ళ దివ్యమూర్తి తెలియజేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో ఇతర రిపోర్టర్లు, ప్రెస్ క్లబ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిజన్ కార్మికుల న్యాయ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

**టీ.ఈ.ఈ 1104 యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుర్గం విశ్వనాథ్**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం) :**



తెలంగాణ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీ.ఈ.ఈ 1104 యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుర్గం విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఆర్టిజన్ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తున్న తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ సంయుక్త చర్య కమిటీకి 1104 యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.విద్యుత్ సంస్థలో ఉద్యోగులకు ఒక విధానం, ఆర్టిజన్ కార్మికులకు మరో విధానం అమలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న సేవా నియమాలను ఆర్టిజన్ కార్మికులకు కూడా వర్తింపజేసి, వారి విద్యార్హతలకు అనుగుణంగా పదోన్నతులు కల్పించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బోర్డు సేవా నియమాలను అమలు చేయడం ద్వారా వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.బ్రిటిష్ కాలం నాటి స్థిర ఆదేశాలను అమలు చేయడం వల్ల ఆర్టిజన్ కార్మికులు అనేక ప్రయోజనాలను కోల్పోతున్నారని విశ్వనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాత విధానాలను వెంటనే రద్దు చేసి, ప్రస్తుత సేవా నియమాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం మరియు యాజమాన్యం తక్షణమే సమస్యలను పరిష్కరించకపోతే ఏప్రిల్ 8 నుండి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు ఆర్టిజన్ కార్మికులు నిర్ణయించుకున్నారని తెలిపారు. ఈ సమ్మెకు టీ.ఈ.ఈ 1104 యూనియన్ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు కార్మికుల పక్షాన ముందుండి పోరాటం చేస్తామని వెల్లడించారు.ఆర్టిజన్ కార్మికుల ప్రధాన డిమాండ్ స్థిర ఆదేశాలను రద్దు చేసి, ప్రస్తుత సేవా నియమాలను అమలు చేయడమేనని, లేకపోతే సమ్మెకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసిన ద్యాప నిఖిల్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఊర్కొండ మండలంలోని రేవల్లి గ్రామానికి చెందిన వద్దే సత్యమ్మ 85 మరియు సర్వగల్ల పాపయ్య 80అనారోగ్యంతో మరణించడం జరిగింది.విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక్కో బాధిత కుటుంబానికి 5000 చొప్పున మొత్తం 10,000 అందజేశారు.ఈ కార్యక్రమంలో, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయ్యుబ్ పాష గారు, సర్పంచ్ రొడ్డ బంగారు పి ఎ సి ఎస్ డైరెక్టర్ ఫరీద్ వార్డు సభ్యులు కాటమోని వెంకటయ్య, కర్రోళ్ల వెంకటయ్య, ఎర్రోళ్ల జంగయ్య, పోలె శంకర్, పరశు రాములు, ఖలీల్ ఖాన్ ,మురళీధర్ రెడ్డి, మాల కృష్ణయ్య, జంగి రెడ్డి, రమేష్, చంద్రయ్య, జంగయ్య, రాములు, కృష్ణయ్య, చంద్రయ్య, విజయ్, లింగమయ్య, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు

## ఉప్పల చారి ట్రబుల్ ద్వారా నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**




తలకొండపల్లి మండలశీ లోనీ సలాపూర్ గ్రామ పంచాయతీ కి చెందిన కావాలి జంగమ్మ భర్త లింగం నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడంతొ స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా రాష్ట్ర నాయకులు మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ నీ సంప్రదించగా వెంటనే స్పందించి తన ట్రస్ట్ ద్వారా సిమెంట్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో,మాజీ వార్డ్ సభ్యులు శ్రీను, వెంకటయ్య, రమేష్,పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా అన్నప్రాసన, ఈసీసీఈ దినోత్సవం

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్ జవహర్ నగర్–1 అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమంతో పాటు ప్రాథమిక బాల్య సంరక్షణ, విద్య దినోత్సవం (ఈసీసీఈ డే) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం ప్రాజెక్టు శిశు అభివృద్ధి అధికారి అలేఖ్య, సిపిఐ ఫ్లోర్ లీడర్, 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మార్కపురి సూర్య మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పిల్లల చేరికలు పెరగడంతో పాటు వారి అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చి అందించే పోషకాహారాన్ని వినియోగించుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. అందరూ అంగన్వాడీ సేవలను వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అంగన్వాడీ కేంద్రాన్ని శుభ్రమైన, సానుకూల వాతావరణంలో నిర్వహిస్తున్న టీచర్లను ఈ సందర్భంగా అభినందించారు. మరింత మంది పిల్లలు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రానికి అవసరమైన సౌకర్యాలను తన దృష్టికి తీసుకువస్తే కౌన్సిల్‌లో చర్చించి ఆమోదం పొందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అన్నప్రాసన కార్యక్రమం సంతోషకర వాతావరణంలో నిర్వహించడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను ఇదే తరహాలో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కపురి ప్రసన్న లక్ష్మి, అంగన్వాడీ టీచర్లు కె. అరుణ, ఎస్. జయసుధ, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

**మహిళలకు ఆర్థిక భరోసా మహాలక్ష్మి పథకం**
**ఉచిత బస్సు ప్రయాణం వెలకట్టలేనిది**
**మహిళా సంఘాలే అసలైన శక్తికి నిదర్శనం**
**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ములుగు :** ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం మహిళల జీవితాల్లో వెలుగు నింపుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్. తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం ఉత్సవాలు 2026" కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 29.03.2026 నాటికి 290 కోట్ల ప్రయాణాల ద్వారా సుమారు 10 వేల కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా అయ్యాయని వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిరపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ములుగు జిల్లాలో ఇప్పటి వరకు 1.90 కోట్ల ప్రయాణాల ద్వారా మహిళలు 133.25 కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని స్పష్టం చేశారు. సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం పథకాలను రూపొందిస్తుందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు ఈ పథకం ద్వారా కూలీ పనులు చేసుకునే వారు, మధ్యతరగతి మహిళలు మరియు ఉద్యోగినులు ఎంతో లబ్ధి పొందుతున్నారని కలెక్టర్ అన్నారు. "గతంలో దూర ప్రాంతాల్లో ఉన్న బిడ్డలను చూడాలంటే ప్రయాణ ఖర్చుల గురించి ఆలోచించేవాళ్లమని, ఇప్పుడు రూపాయి ఖర్చు లేకుండా సాఫీగా ప్రయాణం చేస్తున్నామని" ఒక లబ్ధి పొందిన మహిళ తనతో సంతోషాన్ని పంచుకుందని గుర్తు చేశారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తూ త్వరలోనే సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం గర్వకారణమని, దీనివల్ల వేల కోట్ల రూపాయల ఆదా చేసుకోగలిగారని హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మహిళల సంక్షేమమే ధ్యేయంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో "ఇందిరా మహిళా శక్తి" పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.




# పెను ప్రమాదంగా మారిన అమెరికా సామ్రాజ్యవాద పోకడలు

**యుద్ధంతో సమిదలవుతున్న అమాయకులు**
**నరమేదం జరుగుతన్నా మోడి నోరు మెదపరెందుకో**
**సహజ వనరులు దోచుకునేందుకు మావోయిస్టులపై దాడులు**
**కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నిలుపుకోవాలి**
**ప్రజా పోరాటాలే కమ్యూనిస్టు పార్టీకి అజెండా కావాలి**
**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ సాబీర్ పాషా**

**కొత్తగూడెం:** అమెరికా సామ్రాజ్యవాద యుద్ధ పోకడలు ప్రపంచ శాంతికి పెనుప్రమాదంగా మారుతోందని, ఈ యుద్ధం భారీ ప్రాణ నష్టానికి, ప్రాంతీయ అస్థిరత్వానికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నానికి దారితీసిందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ సాబీర్ పాషా అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు ఎస్ఆర్ గార్డెన్స్ లో మంగళవారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా, ఇజ్రాయేల్ దేశాలు ఇరాన్ పై ఏకపక్ష యుద్ధం చేస్తున్నాయని, దీని వల్ల అమయాకులు సమిదలవుతున్నారని, సుమారు 3300 మందిని పొట్టన పెట్టుకున్నారని, పసి పిల్లలను కూడా వదల్లేదని మండిపడ్డారు. ఈ నరమేదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసం ఉందన్నారు. భారతదేశ నౌకాదళం పై దాడి జరిగినప్పటికీ, దేశంలో యుద్ధం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నప్పటికీ దేశ ప్రధాని నరేంద్రమోడి కనీసం నోరుమెదపక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. విదేశాంగ విధానానికి కట్టుబడ్డ మోడి మానవీయ కోణాన్ని మరిచారని చెప్పారు. అమెరికా ప్రక్కనే ఉన్న క్యూబాపై కూడా కత్తికట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధ కారణంగా దేశంలో పరిస్థితులు క్రమంగా మారిపోతున్నాయని, ధరలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలతో పాటు ఇతర నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ అగార్ పేరుతో 3 వేల మంది మావోయిస్టులను ప్రభుత్వం హతమార్చిందని, కేంద్ర పోకడల కారణంగా అనేక మంది లొంగి పోతున్నారని చెప్పారు. చర్చలకు రానివ్వకుండా మారణహోమం సృష్టిస్తూ భయానక వాతావరణాన్ని కల్పించారని చెప్పారు. మావోయిస్టు రహిత భారతాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పిన కేంద్రం ఆ దిశగా సత్ఫలితాలు సాధించామంటూ చెప్పుకుంటుందని అన్నారు. అడవుల్లో నిక్షిప్తమైన ఉన్న సహజ వనరులను దోచుకునేందుకు కేంద్రం మావోయిస్టులను అడవుల నుండి బయటకు పంపుతోందని, అదానీ, అంబానీలకు అక్కడి సంపదను కారు చౌకగా కట్టబెట్టేందుకు బిజెపి చూస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వల పనితీరుపై ప్రశించే వారిని అర్బన్ నక్సలైట్లు అంటూ ముద్రవేసి వేదింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చే పెను ప్రమాదం ముంచుకొస్తోందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలుపుకోవాలన్నారు. రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు, రైతు రుణ మాఫీ తూతూ మంత్రంగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థను ప్రభుత్వం నిర్లక్షం చేస్తోందని, కార్మికుల హక్కులను కాలరా స్తూ ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సేవ్ సింగరేణి పేరుతో సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడి కార్యక్రమం విజయ వంతమైందని, దీంతో ప్రభుత్వా నికి తమ సత్తా ఎంటోచాటామని తెలిపారు. సింగరేణి కార్మికుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకుల విధానాన్ని అవలంభిస్తోందని తెలిపారు. రాజకీయ సయోధ్యకు తాము కట్టుబడే ఉన్నామని, కానీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసేందుకు వెనుకంజ వేసేదే లేదని స్పష్టం చేశారు. కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, జర్నలిస్టుల సమస్యలపై శాసన సభ్యులు కూనం నేని సాంబశివరావు తన గళాన్ని అసెంబ్లీలో వినిపిస్తున్నారని, చట్ట సభల్లో మన ప్రాతినిధ్యం పెంచుకునేందుకు కృషి చేయాలన్నారు. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటిరిగా బరిలోకి దిగి తమ సత్త ఎంటో చాటామని, కమ్యూనిస్టులను తక్కువ చేసి చూసిన, మాట్లాడిన వాళ్ల నోళ్లు ఎల్లబెట్టుకునే ఫలితాలు సమిష్టిగా రాబట్టడ గలిగామన్నారు. రానున్న జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిద్దామని తెలిపారు. జి వీరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర రావుతో పాటు కే సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, ఎస్టి సలీం, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళీ, మువ్వా వెంకటేశ్వరరావు, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, అడుసుమిల్లి సాయిబాబా, ఎస్ కే ఫహీం దాదా డి శంకర్ బంధం నాగయ్య మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.



## డిపిఓ వీర బుచ్చయ్యకు వీడ్కోలు



**దీర్ఘకాల సేవ అనంతరం ఘన సన్మానం....**
**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,**
**జిల్లా పంచాయతీ అధికారి వీర బుచయ్య రిటైర్మెంట్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, మార్చి 31:**

దీర్ఘకాలం ప్రజలకు సేవలు అందించిన ఉద్యోగుల పదవి విరమణ వేడుకలు ఘనంగా జరిగాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం రంగంపల్లి లోని సాయి గార్డెన్స్ లో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచయ్య పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ముఖ్య అతిథిగా హాజరై పంచాయతీ అధికారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

మాట్లాడుతూ, 30 నుంచి 35 సంవత్సరాల పాటు ప్రజా సేవలో నిర్విరామంగా సేవలు అందించి పదవి విరమణ పొందుతున్నారు అన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఇటీవల నిర్వహించిన పంచాయతీ ఎన్నికలు సజావుగా జరగడంలో కీలక పాత్ర పోషించారని, కేటాయించిన విధులను ఎప్పటికప్పుడు సమర్థవంతంగా నిర్వహిస్తూ బాధ్యతలను నెరవేర్చే వారని కలెక్టర్ గుర్తు చేశారు. పదవి విరమణ తర్వాత కూడా అవసరమైన సమయంలో ప్రభుత్వానికి తమ సూచనలు సలహాలు అందజేస్తూ సేవలు అందించాలని కలెక్టర్ కోరారు. పదవీ విరమణ తర్వాత జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యవంతంగా జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ పదవి విరమణ పొందిన జిల్లా పంచాయతీ అధికారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో నరేందర్ టీఎన్జీవో జిల్లా సంఘం అధ్యక్షుడు బొంకూరు శంకర్, డి ఎల్ పి ఓ దేవకి, కొమురయ్య, ఎంపీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శిల సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్, నిశాంత్, తదితరులు పాల్గొన్నారు

## పదవి విరమణ చేసిన పోలీసు అధికారులకు వీడ్కోలు కార్యక్రమం

**సిద్దిపేట :** సిద్దిపేట్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘంగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు. సింగీతం శంకర్ రావు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, బెజ్జంకి పోలీస్ స్టేషన్ , ఉద్యోగ ప్రస్థానం కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ వరకు అంచలంచలుగా పదవోన్నతి పొంది పనిచేయడం జరిగింది. చాడ శ్రీనివాస్ సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, ఉద్యోగ ప్రస్థానం కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ వరకు అంచలంచలుగా పదవోన్నతి పొంది పనిచేయడం జరిగింది. పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, అభినందించి, సన్మాన పత్రం మెమొంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖలో సుదీర్ఘంగా సర్వస్ పూర్తి చేసుకుని పదవీ విరమణ చేయడం జరుగుతుంది. ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని శుభాకాంక్షలు తెలియజేశారు. సిద్దిపేట పోలీస్ విభాగంలో సుధీర్ఘకాంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన సిబ్బంది సేవను మరువమని, పదవీవిరమణ చేసిన మీరు పోలీస్ కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన సిపి సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి

నరసరావుపేట – గుంటూరు ప్రధాన రహదారిపై మంగళవారం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. మృతులను పల్నాడు జిల్లాలోని గుండాలపాడు గ్రామానికి చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. ప్రమాద ధాటికి బాధితులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఎలా జరిగిందో దర్యాప్తు చేపట్టారు . మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో గుండాలపాడు గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## రొయ్యూరు గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

**మన ఊరు – మన బాధ్యత**
**నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు అత్యంత అవసరం ఏటూరనాగారం ఎస్సై మహేష్**

**ఏటూరు నాగారం :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు గ్రామపంచాయతీలో మంగళవారం గ్రామ సర్పంచ్ కావిరి అర్జున్ అధ్యక్షతన "మన ఊరు మన బాధ్యత" 99రోజుల గ్రామ ప్రణాళిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో యువత, గ్రామ ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంనికి స్థానిక ఎస్సై మహేష్ హాజరై మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలని సూచించారు. గ్రామంలో గుడుంబా తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రొయ్యూర్ గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దుతూ, ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అత్యంత అవసరమని ఎస్ఐ పేర్కొన్నారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసుల పని చేస్తుందని, నేరస్తులను గుర్తించడంలో అవి కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. రొయ్యూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కావిరి అర్జున్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని, అన్ని రంగాల్లో రొయ్యూర్ ముందంజలో నిలపాలని పిలుపునిచ్చారు.

## హుజూర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**హుజూర్నగర్ ::** నూతన పాలకవర్గం హుజుర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దెందుకు కృషి చేయాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. హుజుర్ నగర్ మున్సిపల్ బడ్జెట్ 2026 – 27 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పై మంగళవారం హుజుర్ నగర్ మున్సిపాలిటీ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగించి, సత్ఫలితాలు రాబట్టలని కోరారు. మున్సిపాలిటీ 2026 –27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.33 కోట్లతో బడ్జెట్ రూపొందించడం జరిగిందని వివరించారు. హుజుర్నగర్ మున్సిపాలిటీని దశల వారీగా అభివృద్ధి చేసుకునేందుకు పాలక వర్గం కృషి చేయాలన్నారు. వార్డులలో ఉన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని ముందుకు పోవాలని సూచించారు. ప్రాధాన్యత అంశాలైన త్రాగునీరు, పరిశ్యుధ్యం, రోడ్లకు సంబంధించిన పనుల కోసం ప్రత్యేక గ్రాంట్ల నిధులను వినియోగించుకుని పూర్తి చేయాలని తెలిపారు. రానున్న వేసవికాలం దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## బిజినెస్

### భెల్‌కు రూ.13,500 కోట్ల భారీ ప్రాజెక్ట్




విద్యుత్ ఉత్పత్తి ఉపకరణాల సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్)కు తెలంగాణలో భారీ ప్రాజెక్టు దక్కింది. పెద్దపల్లి జిల్లాలో ఏర్పాటు చేయనున్న 3ఇ800 మెగావాట్ల సామర్థ్యం గల స్టేజ్2 సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం ఎన్‌టిపిసి లిమిటెడ్ నుండి సుమారు రూ.13,500 కోట్ల భారీ ఆర్డర్‌ను పొందింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నోటిఫికేషన్ ఆఫ్ అవార్డ్ (ఎఒఎ)ను మార్చి 29న అందుకుంది. ఈ వివరాలను సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించారు. ఈ కాంట్రాక్టులో భాగంగా బాయిలర్, టర్బైన్, జనరేటర్ (బిటిజి)ల రూపకల్పన, తయారీ, సరఫరా, స్థాపనతో పాటు సివిల్, స్ట్రక్చరల్ పనులను కూడా భెల్ చేపట్టనుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును అవార్డు అందిన తేదీ నుండి 62 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది.

### మెరిసిన పసిడి.. వెలవెలబోయిన వెండి




పసిడి ప్రియులు, కొనుగోలుదారులకు బంగారం ధర షాకిచ్చింది. మంగళవారం ఉదయం బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1030 పెరిగి రూ.1,49,290కి చేరింది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.950 పెరిగి రూ.1,36,850కి చేరింది. మున్ముందు పెళ్లిళ్లు చేసుకునే జంటలు బంగారం కొనుగోలు చేయాలంటే కాస్త ఎక్కువ ఖర్చు చేయాల్సిన పరిస్థితే నెలకొంది. కాగా.. వెండి ధర మాత్రం కాస్త రిలీఫ్ ఇచ్చింది. కిలో వెండిపై రూ.5000 తగ్గింది. ప్రస్తుతం వెండి ధర రూ.2,50,000గా ఉంది. సాధారణంగా డాలర్ పెరిగితే బంగారం తగ్గాలి, కానీ ఈరోజు (మార్చి 31, 2026) పరిస్థితి వేరుగా ఉంది. నిన్న డాలర్ విలువ 95 రూపాయలకు పైగానే ట్రేడ్ అయిన విషయం తెలిసిందే. ఈరోజు బంగారం ధర తగ్గుతుందని భావించిన వారికి షాక్ తగిలినట్లైంది. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో (ముఖ్యంగా అమెరికా-ఇరాన్ మధ్య) నెలకొన్న యుద్ధ వాతావరణం, ఉద్రిక్తతలు పెట్టుబడిదారులను భయపెడుతున్నాయి. ఇటువంటి అస్థిర పరిస్థితుల్లో షేర్లు, కరెన్సీల కంటే బంగారం సురక్షితమైనది అని భావిస్తారు. అందుకే డాలర్ పెరిగినా, ప్రపంచవ్యాప్తంగా అందరూ బంగారాన్ని కొనడం వల్ల డిమాండ్ పెరిగి ధర పెరిగింది.

# సిమ్ బైండింగ్ గడువును పొడిగించే యోచనలో కేంద్రం




కేంద్రం ప్రభుత్వం వాట్సాప్, అరట్టై, టెలిగ్రాం లాంటి మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌లకు తప్పనిసరి సిమ్ బైండింగ్ గడువును పొడిగించే అవకాశం ఉంది. ఈ నిబంధనను పాటించడానికి కంపెనీలకు టెలికమ్యూనికేషన్స్ విభాగం (డీఓటీ) ఈ ఏడాది డిసెంబర్ వరకు గడువు ఇవ్వాలని అధికారులు వెల్లడించినట్లు జాతీయ మీడియా పేర్కొంది. ప్రధానంగా కంపెనీల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించిన ప్రభుత్వం, ఈ మేరకు గడువు పెంపునకు సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. 2025, నవంబర్‌లో కేంద్రం ఈ నిబంధనలు ప్రకటించింది. వీటి అమలు కోసం కంపెనీలకు మూడు నెలలు(90 రోజుల) గడువు ఇచ్చింది. అయితే, ఈ నిబంధనలు అమలులో సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, టెస్టింగ్, ఓఎస్ అప్‌డేట్ లాంటి సవాళ్లు ఉన్నాయని కంపెనీలు స్పష్టం చేశాయి. వీటిని పరిష్కరించి నిబంధనల అమలుకు ఇంకా సమయం కావాలని కేంద్రానికి వివరించాయి. సిమ్ బైండింగ్ అనేది సిమ్ కార్డు ఉంటేనే వాట్సాప్, టెలిగ్రాం లాంటి యాప్స్ మొబైల్‌ఫోన్లలో పని చేసే విధానం. అంటే యూజర్ తాను వాడే ఫోన్‌లో రిజిస్టర్ చేసిన సిమ్ కార్డు ఉంటేనే ఆయా యాప్‌ల అకౌంట్లను యాక్సెస్ చేసే వీలుంటుంది. మరోవైపు, దేశంలో పెరుగుతున్న డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాలకు చెక్ పెడుతూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ(ఎంహెచ్ఏ) 2025 ప్రారంభం నుంచి ఇప్పటివరకు 3,962 స్కైప్ ఐడీలను, 83,867 వాట్సాప్ ఖాతాలను బ్లాక్ చేసింది. అలాగే, మొబైల్, నెట్‌వర్క్ భద్రతను పెంచుతూ నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) వ్యవస్థ ద్వారా గుర్తించిన 8.45 లక్షల సిమ్ కార్డులను, 2.39 లక్షల మొబైల్ ఐఎంఈఐ నంబర్లను అధికారులు బ్లాక్ చేశారు.

# అత్యంత అధ్వాన స్థితిలోకి రూపాయి



ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో రూపాయి పతనం రోజుకో నూతన రికార్డు కనిష్టాన్ని సృష్టిస్తుంది. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ భారత చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా డాలర్‌తో పోల్చితే 95 మార్క్‌ను దాటి అత్యంత అధ్వానస్థితికి పడిపోయింది. సోమవారం ఫారెక్స్ మార్కెట్‌లో 93.62 వద్ద రూపాయి విలువ తెరుచుకుంది. ఆ తర్వాత 165 పైసలు పతనమై 95.20 కనిష్టం వద్ద నమోదయ్యింది. తుదకు 94.78 వద్ద ముగిసింది. ఆర్థిక సంవత్సరం 2025-26లో రూపాయి విలువ ఏకంగా 10 శాతం పైగా పడిపోయింది. ఫిబ్రవరిలో 90.98 వద్ద ఉన్న రూపాయి.. ప్రస్తుతం 95 స్థాయిని తాకి నూతన కనిష్టానికి పడిపోయింది.దీంతో రూపాయి పతనాన్ని అడ్డుకోవడంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బీజేపీ సర్కార్ విఫలమయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.భారత కరెన్సీ ఇదే స్థాయిలో పడిపోతుంటే త్వరలోనే 100 మార్కుకు చేరొచ్చని అంచనాలు పెరుగుతున్నాయి. ముడి చమురు ధర బ్యారెల్‌కు 120 డాలర్లు దాటితే రూపాయిపై మరింత ఒత్తిడి పెరుగుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారత దిగుమతి బిల్లులు పెరగడంతో పాటుగా భారత మార్కెట్ల నుండి విదేశీ పెట్టుబడిదారులు తమ నిధులను వెనక్కి తీసుకోవడం రూపాయిని బలహీనపరుస్తోంది. భారత కరెన్సీ పతనం ఇలాగే కొనసాగితే పెట్టుబడిదారులలో అభద్రతా భావం పెరిగి మార్కెట్లలో మరింత అస్థిరత ఏర్పడే ప్రమాదం ఉంది. 2025-26 ఆర్థికసంవత్సరపు చివరిరోజైన సోమవారం నాడు కూడా మార్కెట్‌ను యుద్ధభయం వెంటాడింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందన్న వార్తలతో పాటు, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. దీంతో సెన్సెక్స్ 1600 పాయింట్లకు పైగా నష్టపోగా, నిఫ్టీ 22,350 పాయింట్లకు దిగువన నష్టపోయింది. మొత్తంమీద 9లక్షల కోట్ల మదుపర్ల సంపద ఒక్కరోజులోనే ఆవిరైంది.

# ఇంగ్లండ్ టూర్‌కు వైభవ్ సూర్యవంశీని పంపండి

భారత యువ సంచలనం, రాజస్తాన్ రాయల్స్ స్టార్ వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్-2026 టోర్నీని ఘనంగా ఆరంభించాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో సోమవారం నాటి మ్యాచ్‌లో ఈ ఓపెనింగ్ బ్యాటర్ దుమ్మురేపాడు. మెరుపు అర్ధ శతకం బాది శెభాష్ అనిపించుకున్నాడు.

**ప్రశంసల వర్షం**

గువాహటి వేదికగా కేవలం 17 బంతుల్లోనే 52 పరుగులు సాధించాడు వైభవ్ సూర్యవంశీ అతడి విధ్వంసకర ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, ఐదు సిక్సర్లు ఉన్నాయి. ఇక వైభవ్ ధనాధన్ ఇన్నింగ్స్ కారణంగా రాజస్తాన్ చెన్నైపై అలవోక విజయం సాధించింది. 128 పరుగుల నామమాత్రపు లక్ష్యాన్ని కేవలం 12.1 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఈ నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇక ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ అయితే ఓ అడుగు ముందుకేసి.. వైభవ్‌ను వెంటనే టీమిండియాకు ఎంపిక చేయాలనే ప్రతిపాదన తెచ్చాడు. క్రిక్‌బజ్ షోలో మాట్లాడుతూ..




**నేనే గనుక సెలక్టర్ అయి ఉంటే**

"అతడు ఎప్పుడు టీమిండియా తరఫున అరంగేట్రం చేస్తాడు? అని నేనెంతో ఆతురతగా ఎదురుచూస్తున్నాను. ఇది కాస్త తొందరపాటే అని అనిపించవచ్చు. ఐపీఎల్ తాజా ఎడిషన్‌లో అతడికి ఇదే తొలి ఇన్నింగ్స్. ఏదేమైనా కొన్ని నెలల తర్వాత టీమిండియా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. ఒకవేళ నేనే గనుక సెలక్టర్ అయి ఉంటే వైభవ్‌ను ఈ టూర్‌కు కచ్చితంగా ఎంపిక చేస్తా. ప్రస్తుతానికి అతడికి జట్టులో చేరాల్సిన అవసరం లేకపోవచ్చు. కానీ జట్టుకు అతడి అవసరం ఉంటుందేమో!.. పదిహేనేళ్ల పిల్లాడిని టూర్‌కు అనుమతిస్తారా? అంటే నేనేమీ చెప్పలేను. కానీ అతడు ఇప్పటికే ఆటగాడిగా పరిణతి సాధించాడు. టీమిండియా తరఫున కూడా కచ్చితంగా సత్తా చాటగలడు" అని మైకేల్ వాన్ పేర్కొన్నాడు. వీలైనంత త్వరగా వైభవ్‌ను జాతీయ జట్టుకు ఎంపిక చేయాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి కి సూచించాడు.

## స్పోర్ట్స్

### ఎవరు ఏమనుకుంటే నాకేంటి?

### ప్రేక్షకుల్ని మురిపించడానికి ఆడను




తనను విమర్శించే వారికి భారత మాజీ కెప్టెన్, ప్రస్తుత కోల్‌కతా నైట్‌రైడర్స్ సారథి అజింక్య రహానే గట్టి కౌంటర్ ఇచ్చాడు. తాను క్రికెట్ ఆడేది పూర్తిగా తన వ్యక్తిగతమని.. ప్రేక్షకుల్ని మురిపించడానికో.. విమర్శకులకు తానేంటో నిరూపించడానికో కాదని స్పష్టం చేశాడు. తన భవిష్యత్తుపై, రిటైర్మెంట్‌పై వచ్చే ఊహాగానాలను రహానే కొట్టిపారేశాడు. 37 ఏళ్ల రహానే గత సీజన్‌లో ముంబై రంజీ ట్రోఫీ సారథ్యం నుంచి తప్పుకున్నాడు. దేశవాళీ పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ నాయకుడిగా కాకుండా ఆటగాడిగానే కొనసా గాడు. దీంతో ఇక విమర్శకులు అదేపనిగా రహానే రిటైర్మెంట్ ఖాయమనే వ్యాఖ్యలు చేస్తున్నారు. ముంబైతో మ్యాచ్ ముగిసిన తర్వాత మీడియా సమావేశంలో దీనిపై రహానే స్పందిస్తూ 'ఎవరికి తోచింది వారు మాట్లాడుకుంటారు. ఇవేమి కొత్తకాదు కదా! దాదాపు 20 ఏళ్లుగా నా గురించి మాట్లాడుకోవడమే పనిగా పెట్టుకున్నారు. వాళ్లని అలాగే కొనసాగనివ్వండి. నేనేమో నా బ్యాటింగ్‌ను ఆస్వాదిస్తాను.

**వాళ్లనలా చూడనివ్వండి**

నా ఆటతీరేంటో నాకు తెలుసు. నా ప్రదర్శన పట్ల సంతృప్తికరంగా ఉన్నాను. అంతేతప్ప నేనేంటో... నా ప్రతిభేంటో కొత్తగా ఎవరికీ చూపించుకోవడానికి ఆడట్లేదు. ప్రేక్షకులు చూస్తున్నారు. వాళ్లనలా చూడనివ్వండి. విమర్శకులు విమర్శిస్తారు. వీళ్లను అలాగే చేయనివ్వండి' అని అన్నాడు. ముంబైతో జరిగిన పోరులో రహానే మెరుపు ఫిఫ్టీతో అదరగొట్టాడు. 40 బంతుల్లో 67 పరుగులు చేసిన 'జింక్స్'... 5 సిక్సర్లు, మూడు బౌండరీలు బాదాడు. గత రెండు మూడేళ్లుగా, పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో నా బ్యాటింగ్‌ను మెరుగుపర్చుకున్న తీరుపట్ల తానెంతో సంతోషంగా ఉన్నానన్నాడు. ఓ క్రికెటర్‌గా, బ్యాటర్‌గా ఎదగడం ముఖ్యమని, తానిప్పుడు చేస్తున్నది కూడా అదేనని రహానె చెప్పుకొచ్చాడు. ముంబైతో జరిగిన పోరులో తాము బాగానే ఆడామని, కీలకమైన తరుణంలో మరిన్ని ఎక్కువ పరుగులు చేయాల్సి ఉండగా చేయలేకపోయామని అన్నాడు.

**మా ఓటమికి కారణం అదే**

'ముందుగా మేం 220 స్కోరు చేస్తే చాలానుకున్నాం. కానీ ఓ దశలో 235 నుంచి 240 పరుగులు చేస్తామని కూడా అనిపించింది. అయితే బుమ్రా స్పెల్ మా జోరుకు అడ్డుకట్ట వేసింది. అతని రెండు ఓవర్ల స్పెలే మరిన్ని పరుగులు చేయకుండా నిరోధించింది' అని రహానే అన్నాడు. అనుభవలేమి బౌలింగ్ కూడా తమ ఓటమికి కారణమని రహానే చెప్పాడు. వైభవ్, కార్తీక్ త్యాగి, ముజరబానిలు తేలిపోయారని చెప్పాడు. ముజరబానికి అంతర్జాతీయ అనుభవమైతే ఉండొచ్చు కానీ ఐపీఎల్ అనుభవమైతే లేదన్నాడు. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మాయాజాలం కూడా పనిచేయలేదని, దీనివల్లే ముంబై జోరుకు ఏ దశలోనూ అడ్డుకట్ట వేయలేకపోయామన్నాడు.

# ఒకే సీజన్లో 67 వికెట్లు.. అయినా పట్టించుకోరు!

గత కొన్నాళ్లుగా టీమిండియా సెలక్షన్ కమిటీ వెటరన్ పేసర్ మహ్మద్ షమీని పట్టించుకోవడం మానేసింది. వన్డే వరల్డ్‌కప్-2023లో భారత్ ఫైనల్ చేరడంలో ఈ రైటార్మ్ బౌలర్ కీలక పాత్ర పోషించాడు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025లో టీమిండియా చాంపియన్‌గా నిలవడంలోనూ షమీది ముఖ్య భూమిక. అయితే, దాదాపు మూడేళ్లుగా షమీకి టెస్టుల్లో ఆడే అవకాశం రాలేదు. ఇక వన్డేల్లో మేజర్ టోర్నీల్లో సత్తా చాటినా.. ఆ తర్వాత సెలక్టర్లు అతడిని పూర్తిగా పక్కనపెట్టేశారు. ఫిట్‌నెస్ సమస్యల వల్లే షమీని జాతీయ జట్టుకు ఎంపిక చేయడం లేదని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ స్వయంగా వెల్లడించాడు. కానీ షమీ మాత్రం ఇందుకు భిన్నంగా స్పందించడమే కాకుండా.. పూర్తి ఫిట్‌నెస్‌తో దేశవాళీ క్రికెట్ బరిలో దిగి సత్తా చాటాడు. బెంగాల్ తరఫున 2025-26 సీజన్లో షమీ మొత్తంగా 67 వికెట్లు కూల్చాడు. అయినప్పటికీ టీమిండియా సెలక్టర్లు అతడి పేరును పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో రిటైర్మెంట్ ఊహాగానాలు వస్తుండగా షమీ స్పందించాడు. శుభంకర్ మిశ్రా షోలో మాట్లాడుతూ.. 'నేను అలసిపోయానని భావించిన మరుక్షణం రిటైర్ అవుతాను. అంతేగాని ప్రస్తుతానికి అలాంటి ఆలోచన ఏమీ లేదు. నిజానికి రిటైర్మెంట్ గురించి ఆలోచిస్తే మనం వెనుకబడి పోతాము. ముందుగా చెప్పినట్లు నేను అలసిపోయాను.. ఆడలేను అని భావించినపుడే నిర్ణయం తీసుకుంటా. ప్రస్తుతానికి నేను ఆటను పూర్తిగా ఆస్వాదిస్తున్నాను. అందుకు తగ్గట్లే సానుకూల ఫలితాలు వస్తున్నాయి' అని షమీ పేర్కొన్నాడు. ఇదిలా ఉంటే.. ఐపీఎల్-2026కు ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ షమీని లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. 'బౌలర్‌గా వంద శాతం బాధ్యతలు నిర్వర్తించగలను. అంచనాలు అందుకునేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాను. మిగతాదంతా నా అదృష్టం మీద ఆధారపడి ఉంటుంది. దానిని నేనైతే మార్చలేను. అంకితభావంతో ఆడటం మాత్రమే నా పని. లక్నో నన్ను నమ్మింది. కచ్చితంగా వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను" అని షమీ చెప్పుకొచ్చాడు. కాగా టీమిండియా తరఫున 2023లో చివరగా టెస్టు ఆడిన షమీ.. 2025లో వన్డే, టీ20 మ్యాచ్‌లు ఆడాడు.





# సల్మాన్ ఖాన్ వంశీ పైడిపల్లి సినిమాలో హీరోయిన్‌గా నయనతార!

ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో మరో భారీ క్రేజీ కాంబినేషన్ సెట్ అయింది. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా నుంచి కథానాయికగా పరిచయం చేశారు మేకర్స్. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో కథానాయికగా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఎంపిక చేసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, శిరీష్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. దిల్ రాజు నిర్మాణ సంస్థకు ఇది 63వ చిత్రం కావడం విశేషం. ఈ అప్‌డేట్‌ను వెల్లడిస్తూ.. ూఎజ63 ప్రాజెక్ట్‌లోకి ది క్వీన్ అడుగుపెట్టింది.. ఎంతో ప్రత్యేకంగా తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లోకి నయనతారను ఆహ్వానించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని చిత్ర బృందం రాసుకోచ్చింది. నయనతార ఇప్పటికే షారుఖ్ ఖాన్ సరసన 'జవాన్' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టి రికార్డు స్థాయి బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు మరోసారి బాలీవుడ్ అగ్ర హీరో అయిన సల్మాన్ ఖాన్‌తో ఆమె జతకట్టడం భారతీయ సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ముగ్గురు దిగ్గజాలైన సల్మాన్ ఖాన్, నయనతార మరియు వంశీ పైడిపల్లి కలయికలో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. దర్శకుడు వంశీ పైడిపల్లి గతంలో దళపతి విజయ్ సరసన 'వారసుడు' (వారిసు) సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు సల్మాన్ ఖాన్‌ను ఆయన ఎలాంటి సరికొత్త కథతో చూపించబోతున్నారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర బృందం త్వరలోనే అధికారికంగా వెల్లడించనుంది.



# నేను ఈ క్యారెక్టర్ చేయగలనని నమ్మిన ప్రతీ ఒక్కరికి థాంక్యూ

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా వస్తున్న లేటెస్ట్ లవ్ ఎంటర్‌టైన్ మూవీ 'చెన్నై లవ్ స్టోరీ'. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు.రవి నంబూరి దర్శకత్వం వహిస్తుండగా.. మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశలో ఉంది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం..తాజాగా 'గుర్తుందా' సాంగ్ రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లాంఛ్ ఈవెంట్‌లో పాల్గొన్న హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ తన పాత్రపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'గ్లింప్స్ రిలీజైనప్పటి నుంచి చెన్నై లవ్ స్టోరీ మూవీ మీద చాలా అంచనాలు ఏర్పడుతున్నాయి. ఈ సినిమాలో కిరణ్‌తో కలిసి వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. ఆయన ఈ చిత్రం తర్వాత మరింత గొప్ప ఇమేజ్ తెచ్చుకుంటారు. అలాగే ఈ మూవీలో ఇంత బరువైన, ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్ నేను చేయగలను అని నమ్మిన దర్శక నిర్మాతలకు థ్యాంక్స్ చెబుతున్నా. మణిశర్మ సంగీతంలో నటించడం ఒక గౌరవంగా భావిస్తున్నా' అని చెప్పుకొచ్చింది.

# నా డ్రీమ్ అదే.. రాకాస ఈవెంట్‌లో నిహారిక



మెగా డాటర్ నిహారిక నటిగా రాణిస్తూనే నిర్మాతగా కూడా దూసుకెళ్తున్నారు. కమిటీ కుర్రోళ్లు మూవీ తర్వాత నిర్మాతగా బిజీ అయిపోయారు. ప్రస్తుతం తన సొంతం బ్యానర్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై రాకాస అనే మూవీని నిర్మించారు. సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా వస్తోన్న ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం ఏప్రిల్ 03న థియేటర్లలో సందడి చేయనుంది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవెంట్‌కు హాజరైన నిహారిక నిర్మాతగా తన అనుభవాలను పంచుకుంది. ఇలాంటి సినిమా తీస్తున్నామనగానే చాలామంది సలహాలు ఇచ్చారని తెలిపింది. వీఎఫ్ఎక్స్ విషయంలో పెద్ద పెద్ద సినిమాలే కష్టపడాల్సి వస్తోంది.. మీది చిన్న బడ్జెట్ సినిమా.. చాలా ఇబ్బంది పెడతారు చూసుకోండని నాతో చెప్పారని గుర్తు చేసుకుంది. ఏం చేసినా మాటలు అనే వాళ్లు అంటూనే ఉన్నారు. అందుకే నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటానని తెలిపింది. ఓ మంచి సినిమా తీశాం.. జనాల్లోకి తీసుకెళ్లడానికి బాగా ప్రమోట్ చేస్తున్నామని నిహారిక వెల్లడించింది. ఇంటింటికి వెళ్లి సినిమా చూపించడానికి కూడా రెడీగా ఉన్నామని నిహారిక పేర్కొంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో భాగమైన ప్రతి ఒక్కరికీ సొంతిల్లు, కారు ఉండాలని ఆశిస్తున్నట్లు నిహారిక తన డ్రీమ్‌ను బయటపెట్టింది. కమిటీ కుర్రోళ్లు మూవీతో 11 మంది కొత్త వాళ్లను పరిచయం చేశానని నిహారిక తెలిపింది.

# ఆదర్శ కుటుంబంలో అదే మెయిన్ హైలైట్..



విక్టరీ వెంకటేశ్, డైరెక్టర్ త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్ చిత్రం 'ఆదర్శకుటుంబం'. చాలా కాలం తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నాయి.అనౌన్స్‌మెంట్ నుంచే ఈ చిత్రంపై సూపర్ బజ్ క్రియేట్ కాగా.. సమ్మర్ స్పెషల్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఈ మేరకు సైలెంట్‌గా షూటింగ్ కూడా కానిచ్చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. ఈ మేరకు "ఆదర్శకుటుంబం'లో ప్రీ-క్లైమాక్స్‌లో వచ్చే స్పెషల్ కామెడీ ఎపిసోడ్ ప్రధాన హైలైట్‌గా నిలవనుందని సమాచారం. వెంకీ కామెడీ టైమింగ్, త్రివిక్రమ్ పంచ్ డైలాగ్స్ కలిసి మళ్లీ నవ్వుల పండుగ తెచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ఇక త్రివిక్రమ్ మార్క్ రైటింగ్‌తో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఈ సినిమాకు బలం కానున్నాయి. సమ్మర్ రిలీజ్ టార్గెట్ చేస్తూ, ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు' అంటూ ఓ పోస్ట్ వైరల్ కాగా.. వెయిటింగ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.



# ఫాంటసీ థ్రిల్లర్‌లో స్వీటీ.. ట్రైలర్ చూశారా?

బాహుబలి సినిమాలతో పాన్ ఇండియా క్రేజ్ సొంతం చేసుకున్న అనుష్క శెట్టి.. బరువు సమస్యల కారణంగా తర్వాత మూవీస్ చేయడం చాలా తగ్గించేసింది. అప్పుడో ఇప్పుడో అన్నట్లు చేస్తూ వస్తోంది. 2023లో 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో హిట్ అందుకున్న ఈ హీరోయిన్.. గతేడాది 'ఘాటీ'తో ఘోరమైన డిజాస్టర్ చవిచూసింది. ఇప్పుడు 'కథనార్' అనే మలయాళ చిత్రంతో వచ్చేందుకు సిద్ధమైంది. ఫాంటసీ థ్రిల్లర్ స్టోరీతో తీసిన ఈ సినిమాని తెలుగు, తమిళంలోనూ రిలీజ్ చేయనున్నారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. ఇందులో అనుష్కకి రెండు మూడు షాట్స్‌కి మాత్రమే పరిమితం చేశారు. విజువల్స్ బాగున్నాయి గానీ కాన్సెప్ట్ అర్థమై అర్థం కానట్లు అనిపించింది. డబ్బింగ్‌లో ఉపయోగించిన తెలుగు పదాలు కూడా సగటు ప్రేక్షకుడికి అర్థం కాని విధంగా ఉన్నాయి. జయసూర్య హీరోగా నటించిన ఈ చిత్రంలో అనుష్క శెట్టి హీరోయిన్. ప్రభుదేవా, శాండీ మాస్టర్, వినీత్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ ఏడాది జూలై ఆగస్టులో థియేటర్లలోకి మూవీ రానుందని తెలుస్తోంది. రోజిన్ థామస్ దర్శకుడు. అనుష్కకి ఇది 50వ మూవీ కావడం విశేషం.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com